**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 44, పేజీలు - 08

ఆదివారం, ఆగష్టు 9, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు తిరస్కరణ!

## - రేవంత్ విజయమా..? చంద్రబాబు వైఫల్యమా..?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ శాఖకు చెందిన నిపుణుల అప్రైజల్ కమిటీ వెనక్కి పంపడంతో తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది. ఈ పరిణామాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తమ నేత రేవంత్ రెడ్డి సాధించిన దౌత్యపరమైన విజయంగా ప్రచారం చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ప్రాథమిక దశలోనే విఫలమైందంటూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. అయితే, ఈ రాజకీయ క్రెడిట్ వార్, ప్రతివిమర్శలకు ఆవల సాంకేతిక, చట్టపరమైన కోణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే, ఇది ఒకరికి లభించిన విజయమో లేదా మరొకరికి ఎదురైన ఓటమో కాదని నదీ జలాల చట్టాలకు అనుగుణంగా జరిగిన ఒక సహజ సిద్ధమైన పరిణామమని స్పష్టమవుతోంది.

### చట్ట ప్రకారం అనుమతుల ప్రక్రియ జరగాల్సిందే

పర్యావరణ అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే, ఏ భారీ నదీ అనుసంధాన ప్రాజెక్టుకైనా ఒక స్పష్టమైన

2లో..




# బీజేపీతో మళ్లీ పొత్తుకు సంకేతాలు

## - డీలిమిటేషన్ బిల్లుకు శిరోమణి అకాలీదళ్ పార్టీ మద్దతు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) బీజేపీ, అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తుందనే ఊహాగానాల నడుమ కేంద్రంలోని మోదీ సర్కారు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పంజాబ్‌కు చెందిన ప్రాంతీయ పార్టీ శిరోమణి అకాలీదళ్ బహిరంగంగా మద్దతు ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ భేటీ అయిన మర్నాడే ఈ ప్రకటన వెలువడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా అకాలీదళ్ బీజేపీ కూటమి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయని ఈ నిర్ణయం స్పష్టమైన సంకేతాన్ని ఇస్తోంది.

2లో..

# కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు

- ముఖ్యమంత్రి రేవంత్‌కు వ్యవసాయంపై అవగాహన శూన్యమన్న కేటీఆర్
- నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధమన్న కేటీఆర్
- 24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించాలని సవాల్
- ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ తీవ్ర పోరాటం చేస్తుందని వెల్లడి




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్లో ఇండస్ట్రియల్ ఏరియాల్లోని భూములను మల్టీ పర్పస్ జోన్లుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) పాలసీ మీద సెప్టెంబర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. 10 వేల ఎకరాల భూమిని ఎవరికో ధారాదత్తం చేసే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ విధానంపై ఇండస్ట్రియల్ అసోసియేషనర్లకు లేఖ రాస్తానని తెలిపారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే ఈ పాలసీని రద్దు చేస్తామని స్పష్టం చేశారు. పరిశ్రమ కోసం ఇంకోచోట భూమి ఇస్తున్నప్పుడు ఈ భూమిని ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇవాళ మీడియాతో ఇష్టాగోష్టిలో మాట్లాడిన ఆయన హిల్ట్ పాలసీ కింద చెల్లింపులు

2లో..

# డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం

## - అఖిలపక్షం భేటీలో విజయ్ నిర్ణయం



చెన్నై కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను అడ్డుకోవాలని తమిళనాడు ప్రభుత్వం నిర్ణయించింది. డిలిమిటేషన్ ప్రక్రియను ప్రారంభించే ఏ ప్రయత్నాన్నైనా అధికారికంగా వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయనున్నారు. ఈ మేరకు అన్ని పార్టీల ఎంపీలతో ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ నిర్వహించిన సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడింది. రాబోయే 40- 50 ఏళ్ల వరకు ప్రజాప్రతినిధుల స్థానాల

2లో..

# చేసిన మంచి చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

- టీడీపీ యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం శిక్షణా తరగతులు
- గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కేడర్‌కు చంద్రబాబు పిలుపు
- ప్రభుత్వ పథకాలు, మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచన
- డీఎస్సీపై ప్రతిపక్షం చేసిన దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొన్నామని వెల్లడి



అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో 'గొడ్డలి పార్టీ' చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి. అలా చేయకపోతే, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. అందుకే చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి" అని స్పష్టం చేశారు. ఇటీవల డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని, అయితే దానికి ప్రభుత్వం గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగిందని గుర్తుచేశారు. "పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని మేము వాస్తవాలు చెప్పడం వల్లే.. గొడ్డలి పార్టీ

2లో..

# ఎల్‌నినో కారణంగా తీవ్ర వ్యవసాయ సంక్షోభం

## - కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆమె విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తాండవిస్తుంటే, ప్రభుత్వం రైతులను గాలికొదిలేసి రాజకీయాలు, పొగడ్త సభల్లో మునిగి తేలుతోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడితో పాటు ప్రధాని నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను షర్మిల గణాంకాలతో సహా వివరించారు. జూలై చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా సాధారణంతో పోలిస్తే 69 శాతం వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. జూన్ 1 నుంచి జూలై మధ్య వరకు 166.76 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 86.51 మి.మీ. మాత్రమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే మూడు నెలల్లో సైతం 40 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని, దీని ప్రభావం ప్రత్యక్షంగా 50 లక్షల ఎకరాలపై పడిందని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని, ఎటు చూసినా బీడు భూములే కనిపిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు.

2లో..

# అమ్మాయిలూ.. రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్లతో జాగ్రత్త

## - యువతులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరిక

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న 'రెంట్ బాయ్‌ఫ్రెండ్' (అద్దెకు బాయ్‌ఫ్రెండ్) ప్రకటనల పట్ల యువతులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ హెచ్చరించారు. మహిళలు, యువతులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఈ కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ మోసపూరిత వ్యవహారానికి సంబంధించిన వివరాలను తన 'ఎక్స్' ఖాతా ద్వారా సజ్జనార్ వెల్లడించారు. గంటపాటు కాఫీ మీటింగ్ కోసం రూ. 499, సినిమా డేట్ కోసం రూ. 1,249, షాపింగ్ కోసం రూ. 1,499, వివాహాలు, ఇతర శుభకార్యాలకు తోడుగా వచ్చేందుకు

2లో..






# పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ

- రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయం
- ఆదివారం నర్సంపేటకు వెళ్లనున్న కేసీఆర్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదివారం నర్సంపేటకు వెళ్తున్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కేసీఆర్ పరామర్శిస్తారు. నేడు నర్సంపేట నియోజకవర్గంలోని పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగ్రామం నల్లబెల్లికి బయలుదేరి వెళ్ళనున్న కేసీఆర్ ఇంటి పెద్దను కోల్పోయిన పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పనున్నారు. కష్ట కాలంలో

2లో..



# హైడ్రా ఉద్యోగాల భర్తీ

## - భారీగా తరలి వచ్చిన యువత - సరూర్ నగర్ స్టేడియం వద్ద టెన్షన్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల భర్తీ చేపడుతున్నామని చెబుతున్నప్పటికీ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం చదువులను పూర్తిచేసుకుని ఉద్యోగాల వేటలో పడుతున్న నిరుద్యోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. తాజాగా తెలంగాణ రాష్ట్రంలో ఎంత నిరుద్యోగం ఉందో,

2లో..



# ఎల్ నినో ముప్పు.. కార్యాచరణకు ఆదేశాలు

## - 'జలధార-జలహారతి' నిరంతరం కొనసాగించాలన్న సీఎం



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం అంచనాలకు మించి తీవ్రంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయని, ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. జల వనరుల పరిరక్షణ కోసం చేపట్టిన 'జలధార-జలహారతి' కార్యక్రమాన్ని ఇకపై ఒక నిరంతర కార్యక్రమంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా, పంటల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపునకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

2లో..

# చేసిన మంచి చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

మినహా కొన్ని ఇతర పార్టీలకు చెందిన నేతలు కూడా తప్పులు జరగలేదని బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పుడు అదే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన టీచర్లే గొడ్డలి పార్టీ తీరును తప్పుపడుతూ ఆందోళనలు చేపట్టారు" అని చంద్రబాబు వివరించారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించిన వాస్తవాలు ప్రజల ముందు ఉంచితే, కుట్రలను వారే ఛేదిస్తారని అన్నారు. దీనికి కర్నూల్‌లో టీచర్లు గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనే నిదర్శనమని తెలిపారు. మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనడానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చామని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యవస్థలను గాడిలో పెడుతూ సంక్షేమం-అభివృద్ధిని సమంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.పార్టీ క్రమశిక్షణపై మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుంచి అగ్ర నాయకుడి వరకు అందరికీ పార్టీనే సుప్రీం అని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో 'జీరో టాలరెన్స్' పాటిస్తామని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తాను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నానని అన్నారు. గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా, ప్రతి బూత్‌లోనూ గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై ప్రభావం చూపుతుందని, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్‌లకు, మండల అధ్యక్షులకు తగిన గౌరవం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం

సంఖ్యలో మార్పును రాష్ట్రం భరించలేదని, అందుకే డిలిమిటేషన్ ప్రక్రియకు ఐక్యంగా 'నో' చెప్పాలని నాయకులు నిర్ణయించినట్లు వర్గాలు వెల్లడించాయి.

### డీలిమిటేషన్‌కు వ్యతిరేకం

"మేము డిలిమిటేషన్‌కు మద్దతు ఇవ్వం, అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి విజయ్ చాలా మంచి అడుగు వేశారు ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన అమలులోకి వస్తే ప్రజాస్వామ్యానికి సరైన అర్థం ఉండదు, తమిళనాడు ప్రజల ప్రయోజనాలను, హక్కులను కాపాడటానికి ముఖ్యమంత్రి తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు" అని కాంగ్రెస్ ఎంపీ జోతిమణి పేర్కొన్నారు.

### విజయ్‌కు కనిమొళి సవాల్

అధికార టీవీకే కూటమికి చెందిన కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్ తో పాటు సీపీఐ, సీపీఐ(ఎం) వంటి మిత్రపక్షాలకు చెందిన ఎంపీలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. మొత్తం 19 మంది ఎంపీలు హాజరయ్యారు. అయితే ప్రధాన ప్రతిపక్షం డీఎంకే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించుకుంది. ఆ పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కనిమొళి తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్‌ద్వారాన్నతలను ప్రశ్నిస్తూ కావేరీ నదిపై కర్ణాటక ప్రతిపాదిత మేకెదాటు డ్యామ్‌పై చర్యలు తీసుకోవాలని ఆయనకు సవాలు విసిరారు.మేకెదాటు ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్ర జలశక్తి మంత్రికి వ్యక్తిగతంగా సమర్పించేందుకు, తమిళనాడు ప్రభుత్వ ప్రతినిధులతో పాటు రాష్ట్ర ఎంపీలను పంపాలని విజయ్ సిద్ధంగా ఉన్నారా? అని కనిమొళి ప్రశ్నించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టే ప్రణాళికలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రకటించలేదు. అలాగే ప్రస్తుత చట్టాన్ని సవరించడానికి ఎలాంటి ప్రతిపాదనలను కూడా వెల్లడించలేదు.పార్లమెంటులో రాష్ట్ర ప్రాతినిధ్యాన్ని తగ్గించే లేదా దాని హక్కులను ప్రభావితం చేసే ఎలాంటి డిలిమిటేషన్ ప్రక్రియనైనా వ్యతిరేకించేందుకు డీఎంకే దృఢంగా ఉందని ఆమె అన్నారు. గతంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం), వీసీకే, ఐయూఎంఎల్ వంటి పార్టీలు రాష్ట్రానికి హానికరమైన ఎలాంటి డీలిమిటేషన్ ఫార్ములానైనా వ్యతిరేకించాయని ఆమె తెలిపారు.

### డీఎంకేపై విజయ్ విమర్శలు

ఆరుసార్లు తమిళనాడును పాలించి, రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగాలు చేసిన వ్యవస్థాపక నాయకులున్న పార్టీ ఈ సమావేశానికి హాజరు కాకపోవడం దురదృష్టకరమని విజయ్ అన్నట్లు తెలిసింది. ఈ సమావేశానికి హాజరైన నాయకులందరూ మాట్లాడారు. కాంగ్రెస్ కు చెందిన 11 మంది ఎంపీలలో నలుగురికి మాట్లాడే అవకాశం లభించింది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను వ్యతిరేకిస్తూ తమిళనాడు అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించాలని ఏకాభిప్రాయం వ్యక్తమైంది. తమిళనాడులో లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచడాన్ని ప్రభుత్వం ఎందుకు వ్యతిరేకిస్తోందో, ఆ బిల్లులోని సూక్ష్మాంశాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందనే ప్రశ్నను కాంగ్రెస్ లేవనెత్తింది. చివర్లో విజయ్ సుమారు ఆరు నిమిషాల పాటు మాట్లాడారు. లోక్‌సభలో 543, తమిళనాడులో 39గా ఉన్న సీట్ల సంఖ్యను శాశ్వతంగా కొనసాగించాలని అధికార కూటమి డిమాండ్ చేయాలని సమావేశం నిర్ణయించింది.

## ఎల్ నినో ముప్పు.. కార్యాచరణకు ఆదేశాలు

శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి.. జలధార–జలహారతి కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

### 39 శాతం లోటు వర్షపాతం.. తీవ్ర నీటి సంక్షోభం

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం సాధారణం కంటే 39 శాతం తక్కువగా నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జూన్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో సాధారణంగా 867 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 525 మి.మీ. మాత్రమే కురిసే అవకాశం ఉందని అంచనాలు నివేదించారు. ముఖ్యంగా ఆగస్టు నెలలో లోటు 56 శాతానికి చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ వర్షాభావ పరిస్థితుల ప్రభావం ఇప్పటికే రిజర్వాయర్లపై స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని బేసిన్లలో కలిపి ప్రస్తుతం 563.05 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండగా, గతేడాది ఇదే సమయానికి 825.67 టీఎంసీల నీరు అందుబాటులో ఉండేదని పోల్చి చెప్పారు. ఆగస్టు నుంచి భూగర్భ జలమట్టాలు కూడా వేగంగా పడిపోయే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

### తాగునీటి సరఫరాకే అగ్ర ప్రాధాన్యం

ఎల్ నినో తీవ్రత దృష్ట్యా తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వెలుగోడు, గోరకల్లు, అవుకు, జీడిపల్లి, చెర్లోపల్లి వంటి రిజర్వాయర్లలో తాగునీటి అవసరాల కోసం ప్రత్యేకంగా నీటిని నిల్వ చేయాలని సూచించారు. నాగార్జున సాగర్ కాలువల ద్వారా వివిధ జిల్లాల తాగునీటి అవసరాలకు నీటి కేటాయింపులపై వెంటనే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని ఒడిసి పట్టుకుని, ప్రాజెక్టులను వీలైనంత మేర నింపాలని దిశానిర్దేశం చేశారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు.

### పంటలు, పశుసంపద రక్షణకు చర్యలు

వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఇప్పటికే సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు ప్రాధాన్యతా క్రమంలో నీటిని విడుదల చేయాలని సీఎం సూచించారు. భవిష్యత్తులో తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించడంపై దృష్టి సారించాలని చెప్పారు. అదే సమయంలో, పరిశ్రమలకు కూడా నీటి కొరత లేకుండా చూడాలన్నారు.

పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల గోకులాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. నీటి వినియోగం, పొదుపుపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు తీసుకోవాలని కోరారు. ఈ సమీక్షలో అధికారులు 'జలధార–జలహారతి' కార్యక్రమ పురోగతిని సీఎంకు వివరించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.3,409.35 కోట్ల అంచనాతో 82,865 పనులు గుర్తించగా, ఇప్పటికే 79,826 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. చెరువులు, ఫీడర్ ఛానళ్లు, ఫార్మ్ పాండ్ల వంటి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, నీటిపారుదల, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు తిరస్కరణ!

చట్టబద్ధమైన కార్యాచరణ ఉంటుంది. కేంద్ర జల సంఘం ద్వారా శాస్త్రీయంగా నీటి లభ్యత ధృవీకరణ పొందకుండానే పర్యావరణ అనుమతుల కోసం వెళ్లడం సాంకేతికంగా సరికాదు. చట్టబద్ధమైన ప్రాథమిక అనుమతులు లేకుండా ముందుకెళితే, భవిష్యత్తులో గ్రీన్ ట్రిబ్యునల్ లేదా సుప్రీంకోర్టు పరిధిలో పిటిషన్లు దాఖలై ప్రాజెక్టుపై శాశ్వత స్టే వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి కేంద్రం ఈ ప్రతిపాదనలను తిరస్కరించి వెనక్కి పంపడం అనేది ప్రాజెక్టుకు ముమ్ముందు చట్టపరమైన చిక్కులు ఎదురుకాకుండా నిరోధించే ఒక ముందస్తు చర్యగా పరిగణించవచ్చు.

### ప్రభావిత రాష్ట్రాల అనుమతి తప్పనిసరి

గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ నిబంధనలు, అంతర్రాష్ట్ర ఒప్పందాల ప్రకారం ఎగువ , దిగువన ఉన్న ప్రతి ఒక్క రాష్ట్ర ప్రయోజనాలను రక్షించాల్సిన రాజ్యాంగ బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ఏపీ రూపొందించిన ప్రస్తుత ప్రాజెక్టు డిజైన్ ద్వారా తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు కూడా ముంపు ముప్పు, నీటి కేటాయింపులపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. గోదావరి బేసిన్ నుంచి సముద్రంలోకి వెళ్లే మిగులు, వరద నీటి పరిమాణాన్ని శాస్త్రీయంగా లెక్కించి, వాటాలపై స్పష్టత ఇచ్చే వరకు సీడబ్ల్యూసీ లేదా ఈఏసీ అనుమతులు మంజూరు చేయడం అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టాలకు విరుద్ధమవుతుంది.

### అన్ని ఆమోదాలతో వస్తేనే ప్రయోజనం

రాజకీయంగా ఇది కూటమి ప్రభుత్వానికి బ్రేక్ పడటంలా అనిపించినప్పటికీ, సుదీర్ఘ కాలంలో ఈ ప్రాజెక్టుకు లభించే లీగల్ సెక్యూరిటీగా దీన్ని చూడవచ్చు. క్షేత్రస్థాయి ముంపు వివరాలు , నీటి కేటాయింపులపై పక్కా నివేదికలు లేకుండా ముందుకెళ్లడం వల్ల చట్టపరమైన పునాది బలహీనపడేది. పొరుగు రాష్ట్రాలతో సమగ్ర సంప్రదింపులు జరిపి, అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించుకున్న తర్వాతే సీడబ్ల్యూసీ నీటి లభ్యత ధృవీకరణ పత్రంతో మళ్లీ పర్యావరణ అనుమతులకు రావాలని కేంద్రం సూచించడం ద్వారా ప్రాజెక్టుకు ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ లభించింది.రాయలసీమ దాహార్తిని తీర్చేలా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద నీటిని తరలించి, దాదాపు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించడం ఏపీకి అత్యంత ప్రాధాన్యమైన అంశం. ఇటువంటి మెగా ప్రాజెక్టు రూపుదిద్దుకోవాలంటే తొందరపాటు నిర్ణయాలు, పొలిటికల్ అజెండాల కంటే చట్టబద్ధమైన అడుగులే శ్రీరామరక్ష. సాంకేతిక లోపాలను సరిదిద్ది, అంతర్రాష్ట్ర సంప్రదింపులు పూర్తి చేసి చట్టబద్ధంగా ముందుకెళ్తేనే ఈ ప్రాజెక్టుకు శాశ్వత మనుగడ సాధ్యమవుతుంది.

### సాంకేతిక అడ్డంకి మాత్రమే

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని పొలిటికల్ విక్టరీగా చూపుతున్నప్పటికీ, ఏపీ ప్రభుత్వం ఎదుర్కొన్నది సాంకేతిక ప్రతిబంధకాన్ని మాత్రమే గానీ ప్రాజెక్టు, రద్దును కాదు. కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా సీడబ్ల్యూసీ నివేదికను సిద్ధం చేసుకుని, పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలను నివృత్తి చేస్తూ ముందుకు సాగితేనే పోలవరం–బనకచర్ల అనుసంధానం సుసాధ్యమవుతుంది. రాజకీయ విమర్శలను పక్కనపెట్టి, నిబంధనల ప్రకారం లీగల్ బ్యాకప్‌తో ఏపీ ప్రభుత్వం ముందడుగు వేయడమే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భవిష్యత్తుకు అత్యంత సురక్షితమైన మార్గం.

# బీజేపీతో మళ్లీ పొత్తుకు సంకేతాలు

### అన్ని రాష్ట్రాల్లోనూ 50 శాతం పెంపు

కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ ప్రణాళికను సమర్థిస్తూ దేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని బాదల్ శనివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల్లో స్థానాలను సమానంగా 50 శాతం పెంచాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఎస్ఏడీ మద్దతు ఇస్తుందని తెలిపారు. "చండీగఢ్‌లో జరిగిన పార్టీ సీనియర్ నేతల సమావేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశాం, మహిళల గౌరవం, సమానత్వం, సమాన హక్కుల కోసం పోరాడిన సిక్కు గురువుల బోధనల నుంచి శిరోమణి అకాలీదళ్ స్ఫూర్తి పొందుతుంది. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఇప్పటికే తన సభలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి ఆదర్శంగా నిలిచింది. పార్లమెంట్ ముందుకు వచ్చిన కీలక అంశాలపై చర్చించిన అనంతరం, అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించేలా న్యాయమైన డిలిమిటేషన్ జరగాలని భావిస్తున్నాం. పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'అన్ని రాష్ట్రాల్లో 50 శాతం స్థానాల సమాన పెంపు' ప్రతిపాదనకు మేము మద్దతు ఇస్తున్నాం' అని బాదల్ వెల్లడించారు.త ఏప్రిల్‌లో పార్లమెంట్‌లో డిలిమిటేషన్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టినప్పుడు అకాలీదళ్ దానిని తీవ్రంగా వ్యతిరేకించి, ప్రతిపక్షాలతో కలిసి వ్యతిరేకంగా ఓటు వేసింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పంజాబ్‌కు తక్కువ స్థానాలు పెరుగుతాయని, ఇది పంజాబ్‌కు వివక్షపూరితమైనదని అప్పట్లో పేర్కొంది. కానీ, ఇప్పుడు పొత్తు చర్చలు వేగం పుంజుకోవడంతో 50% స్థానాల పెంపు హామీతో ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.

### రాజకీయ సమీకరణాలు

2020లో వివాదాస్పద వ్యవసాయ చట్టాలతో బీజేపీ, అకాలీదళ్ మధ్య దాదాపు రెండున్నర దశాబ్దాల బంధం తెగిపోయింది. ఆ సమయంలో ఎన్డీయే కూటమి నుంచి అకాలీదళ్ బయటకు వచ్చింది. ఆ తర్వాత 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇరు పార్టీలు ఒంటరిగానే పోటీ చేశాయి. 2024 ఎన్నికల్లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేకపోగా, అకాలీదళ్ కేవలం ఒక స్థానానికే పరిమితమైంది. పార్లమెంట్‌లో ప్రధానితో బాదల్ శుక్రవారం భేటీ కావడంతో కూటమి పునరుద్ధరణపై ప్రచారం మొదలైంది. పంజాబ్ బీజేపీ వర్గాలు, ఎస్ఏడీ, ఆర్ఎస్ఎస్‌లతో పాటు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన నేతలు కూడా పొత్తుకు అనుకూలంగా ఉన్నారు. దీనిపై బీజేపీ కేంద్ర నాయకత్వమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

గతంలో అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషించగా బీజేపీ చిన్న భాగస్వామిగా ఉండేది. కానీ, ఈసారి సమాన ప్రాతిపదికన పొత్తు ఉండాలని బీజేపీ కోరుతున్నట్లు సమాచారం. సీట్ల సర్దుబాటు వంటి వివరాలను తర్వాత చర్చించవచ్చని, పంజాబ్ పరిస్థితులను మెరుగుపరచడమే ప్రస్తుతం తమ ప్రాధాన్యత అని అకాలీదళ్ నేతలు చెబుతున్నారు.

# కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు

చేసేవారు ఆర్థిక నష్టాన్ని చవిచూస్తారని హెచ్చరించారు. పారిశ్రామికవేత్తలు భూ మాఫియాతో కుమ్మక్కు కావొద్దని విజ్ఞప్తి చేశారు.

### కేసీఆర్ చేసినన్ని యాగాలు మరెవరూ చేయలేదు

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసినన్ని యాగాలు మరెవరూ చేయలేదని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు నిర్వహిస్తున్న వరుణ యాగాలు సహా వివిధ అంశాలపై ఆయన స్పందించారు. యాగాలు చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం తన బాధ్యతలను కూడా నిర్వర్తించాలని తెలిపారు. దైవానుగ్రహానికి మానవ ప్రయత్నం తోడైనప్పుడే ఫలితాలు లభిస్తాయని హితవు పలికారు.

### కాంగ్రెస్వి సిగ్గుమాలిన రాజకీయాలు

హరీశ్రావు దేవాలయానికి వెళ్తే కాంగ్రెస్ నాయకులు చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. చేతబడి, క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నీచమైన, సిగ్గులేని రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. వ్యవసాయం, రైతుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి కనీస అవగాహన గానీ చిత్తశుద్ధి గానీ లేవని ఆక్షేపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే సీఎం ఆ జిల్లాకే సాగునీరు అందించడంలో విఫలమవుతున్నారని ఆయన విమర్శించారు.

### కేసీఆర్ నాయకత్వంలో భారీ పోరాటం

అధికారంలో ఉన్నా లేకపోయినా తాము ఎప్పుడూ రాష్ట్ర శ్రేయస్సునే కోరుకుంటామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధమన్న ఆయన 24 గంటల విద్యుత్ సరఫరా ఎక్కడ ఉందో కాంగ్రెస్ నాయకులు తనకు చూపించాలని సవాలు విసిరారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్ నీటిని తరలిస్తున్నా ఈ ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటోందని ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కులను ఏపీ హరిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.కేసీఆర్ నాయకత్వంలో తాము బీభత్సమైన పోరాటం చేస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ స్థాయిలోనే మరో ఉద్యమాన్ని ప్రారంభిస్తామన్నారు. గోదావరి బోర్డు సమావేశంపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం హైదరాబాద్లో హైడ్రా పేరుతో పేదల కడుపు కొడుతోందంటూ ఆయన విమర్శించారు.

# ఎల్‌నినో కారణంగా తీవ్ర వ్యవసాయ సంక్షోభం

ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని షర్మిల ఆరోపించారు. "పాలనను గాలికొదిలేసి, కులమత కొట్లాటల్లో, కేసుల్లో, మోదీ పొగడ్త సభల్లో మీరు, మీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బిజీగా ఉన్నారు. అటు వైసీపీ, ఇటు కూటమి రెండూ ఒకటే. వీరికి రాష్ట్రం, ప్రజల బాగోగులు పట్టవు" అని ఆమె వ్యాఖ్యానించారు. ఆరేడు నెలలుగా ఎల్‌నినో ముప్పు పొంచి ఉందని ప్రపంచవ్యాప్తంగా హెచ్చరికలు వస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం కనీస కంటింజెన్సీ ప్రణాళికలు కూడా సిద్ధం చేయలేదని దుయ్యబట్టారు. జిల్లాల వారీగా సమీక్షలు, రైతులకు మార్గదర్శకాలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం క్వాంటం, డేటా సెంటర్లంటూ కబుర్లు చెబుతూ కాలం గడుపుతున్నారని, మిమ్మల్ని నమ్ముకున్న లక్షలాది రైతుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీ కాంగ్రెస్ తరపున పలు డిమాండ్లను ఆమె ప్రభుత్వం ముందు ఉంచారు.

### కాంగ్రెస్ పార్టీ డిమాండ్లు:

1. ఎండిపోయిన పంటలకు ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించాలి.
2. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ఉచితంగా లేదా సబ్సిడీపై అందించాలి.
3. రిజర్వాయర్ల నుంచి చివరి ఆయకట్టు భూములకు కూడా నీరందేలా చూడాలి.
4. వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేయాలి.
5. రైతులకు కొత్తగా వడ్డీ లేని రుణాలు అందించాలి.
6. ఎల్‌నినో నష్టాలను అంచనా వేసి ప్రతి రైతుకు ఉచితంగా పంటల బీమా వర్తింపజేయాలి.
7. పశుగ్రాసం కొరత తీర్చేందుకు పాడి రైతులకు ప్రత్యేక సబ్సిడీలు ఇవ్వాలి.

తక్షణమే మేల్కొని మంత్రులను, ప్రభుత్వ యంత్రాంగాన్ని రంగంలోకి దింపి రైతులను ఆదుకోవాలని షర్మిల సూచించారు. "ఇప్పటికైనా కళ్ళు తెరవకపోతే రైతులు, ఇతర వర్గాల ప్రజలతో కలిసి మీ సర్కారు వెన్ను విరిచి మరీ నిలదీస్తారని మరవకండి" అని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# అమ్మాయిలూ.. రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్లతో జాగ్రత్త

రూ. 1,999, రోజంతా అందుబాటులో ఉండేందుకు రూ. 4,499 అంటూ ఆకర్షణీయమైన ప్యాకేజీలతో కూడిన పోస్టర్లను ప్రచారం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఇంటర్నెట్ నుంచి సేకరించిన లేదా 'ఏఐ' సాంకేతికతతో సృష్టించిన అందమైన యువకుల ఫోటోలను వాడుతూ, గోప్యత పాటిస్తామని నమ్మబలుకుతున్నారని పేర్కొన్నారు.ఈ ప్రకటనలను నమ్మి ఎవరైనా సంప్రదిస్తే, వారితో స్నేహంగా మాట్లాడి తొలుత అడ్వాన్స్ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని డిమాండ్ చేస్తారని వివరించారు. డిజిటల్ వ్యాలెట్లు లేదా క్యూఆర్ కోడ్‌ల ద్వారా నగదు బదిలీ చేయించుకున్న వెంటనే బాధితుల ఖాతాలను బ్లాక్ చేస్తారని తెలిపారు. ఒకవేళ ఆన్‌లైన్‌లో పరిచయమైన వారిని నేరుగా కలిస్తే, వారి నుంచి బ్లాక్‌మెయిల్, బెదిరింపులు లేదా ఇతర భద్రతాపరమైన ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని కమిషనర్ హెచ్చరించారు.ఇలాంటి ఆఫర్లకు స్పందించవద్దని, ఎట్టిపరిస్థితుల్లోనూ ముందస్తుగా నగదు చెల్లించవద్దని సజ్జనార్ సూచించారు. తమ పిల్లల సోషల్ మీడియా కార్యకలాపాలపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని కోరారు. ఎవరైనా ఈ మోసానికి గురైనా లేదా ఇటువంటి అనుమానాస్పద పోస్టులు గమనించినా వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ప్రకటనలపై సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే విచారణ ప్రారంభించిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ స్పష్టం చేశారు.

# పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ

ఉన్న వారికి భరోసా ఇవ్వనున్నారు. నర్సంపేట నియోజకవర్గం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పెద్ది అభిమానులకు ధైర్యం ఇవ్వనున్నారు.

### పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం

మరోవైపు పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకునేందుకు కేసీఆర్ భారీ ఆర్థిక సాయం ప్రకటించారు. పెద్ది కుటుంబానికి పార్టీ తరుపున 2 కోట్ల 25 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించారు.

పార్టీ సీనియర్ నేతలు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయల చొప్పున అందించాలని పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున, ఆమె బాగోగుల కోసం మరో రూ. 25 లక్షలు ఆమె పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు.పెద్ది సుదర్శన్ రెడ్డి పిల్లల భవిష్యత్తు, వారి చదువు, కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మల కార్యక్రమాలు ముగిసిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్యనేతలు చర్చించి, పెద్ది కుటుంబానికి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారని వెల్లడించారు.

నర్సంపేట మాజీ ఎమ్మెల్యేగా పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి ఇటీవల కన్నుమూశారు. జూలై 26వ తేదీ ఉదయం ఛాతీనొప్పి రావటంతో ఆయనను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సుదర్శన్ రెడ్డికి వెంటిలేటర్ మీద చికిత్స అందించారు. అయితే ఐదు రోజుల తర్వాత పెద్ది సుదర్శన్ రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

# హైడ్రా ఉద్యోగాల భర్తీ

నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎంతగా ఎదురుచూస్తున్నారో హైడ్రాలో ఉద్యోగాల కోసం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం వద్దకు వచ్చిన నిరుద్యోగులను చూస్తే అర్థమవుతుంది.

### హైడ్రాలో కాంట్రాక్ట్ పద్ధతిలో 150 ఉద్యోగాలు.. పోటెత్తిన నిరుద్యోగులు

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన 150ఉద్యోగాలను భర్తీ చేయడం కోసం ఆగస్టు 8, 9తేదీలలో నేరుగా ఫిజికల్ టెస్టులు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఈ నోటిఫికేషన్ ద్వారా 100 ఎతీట అసిస్టెంట్, 50 హెవీ వెహికల్ డ్రైవర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అయితే 150 ఉద్యోగాల కోసం ఊహించని విధంగా యువత సరూర్నగర్ ఇండోర్ స్టేడియం వద్ద పోటెత్తారు.

### పోస్టుల భర్తీకి అధికారిక నోటిఫికేషన్ విడుదలకు డిమాండ్

ఉదయం నుంచి అభ్యర్థులు స్టేడియం వద్దకు చేరుకోవడంతో ఆ పరిసరాలలో రద్దీ నెలకొంది. సమయం గడుస్తున్నకొద్దీ ఉద్యోగార్థుల సంఖ్య పెరగడంతో వారిని కంట్రోల్ చేయడం కష్టంగా మారింది. ఉద్యోగార్థులు పెద్దసంఖ్యలో క్యూలైన్లో నిలబడి దరఖాస్తు ప్రక్రియ కోసం వేచి చూస్తున్నారు.

అయితే అక్కడికి వచ్చిన భారీ నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని కొందరు ఈ పోస్టుల భర్తీకి అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆన్లైన్లో దరఖాస్తులను స్వీకరించాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఏర్పాట్ల పైనా అభ్యర్థుల అసహనం

ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ పైన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, అందరికీ ఆమోదయోగ్యమైన సమర్థవంతమైన విధానాన్ని అనుసరించాలని వారు కోరుతున్నారు. ఇక్కడికి వచ్చిన అభ్యర్థులు ఏర్పాట్ల పైన అసహనం వ్యక్తం చేస్తున్నారు. భారీ సంఖ్యలో నిరుద్యోగులు రావడంతో అక్కడ తోపులాట జరుగుతుంది. దీంతో పోలీసులు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తమయ్యారు.

### స్టేడియం వద్ద భారీగా భద్రత

స్టేడియం వద్ద భారీ భద్రత ఏర్పాట్లను చేశారు. ఇంకా దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉన్న క్రమంలో పోలీసులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. రద్దీ నియంత్రణకు అదనపు బలగాలను మోహరించారు. హైడ్రా లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పైన యువతలో ఆసక్తి అధికంగా ఉండడం ఈ రద్దీకి ప్రధాన కారణంగా అధికార వర్గాలు ఉన్నాయి. అయితే అభ్యర్థుల సౌకర్యం కోసం మెరుగైన ఏర్పాట్లు చేయాలని పెద్ద ఎత్తున డిమాండ్లు వినిపిస్తున్నాయి. పోలీసులు పరిస్థితిని అదుపులో ఉంచేందుకు ప్రస్తుతం చర్య తీసుకుంటున్నారు.

# గిరిజనాభివృద్ధికి కూటమి కట్టుబాటు -- మంత్రి అచ్చెన్నాయుడు



**పార్వతీపురం(ప్రశ్న న్యూస్)** గిరిజనుల హక్కులు, సంక్షేమం, సర్వతోముఖ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో కలిసి ఆయన పాల్గొన్నారు.అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జీవో నెం.3 అంశంలో గిరిజనులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం న్యాయపరమైన చర్యలు చేపడుతోందని వెల్లడి.ఉత్తరాంధ్రలో నేరేడి బ్యారేజ్, తోటపల్లి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు.గిరిజనుల జీవన ప్రమాణాల మెరుగుదల, ఆర్థిక స్వావలంబన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు.డీఎస్సీ నియామకాలపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న విమర్శలను మంత్రి అచ్చెన్నాయుడు ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని, ఇప్పుడు మెగా డీఎస్సీపై విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# సొంత నిధులతో లక్ష్మీనగర్ కాలనీ అభివృద్ధి పనులు

**గుడి షెడ్ నిర్మాణం పూర్తి.. రోడ్ల సమస్యల పరిష్కారానికి కమిటీ కృషి**



కీసర ( ప్రశ్న న్యూస్) కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ బండ్లగూడ లక్ష్మీనగర్ కాలనీ అభివృద్ధి కోసం కాలనీ కమిటీ అసోసియేషన్ సభ్యులు సమష్టిగా ముందుకు సాగుతున్నారు. దాదాపు వారం రోజులుగా కమిటీ సభ్యులు సొంత నిధులతో కాలనీలో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నారు. కాలనీలోని పోచమ్మ తల్లి గుడి షెడ్ నిర్మాణం, పరిసరాల అభివృద్ధి పనులను కమిటీ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. అలాగే కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు."మన కాలనీ – మన బాధ్యత.. మన గుడి – మన అభివృద్ధి" అనే నినాదంతో కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమాల్లో కమిటీ అధ్యక్షుడు అభిలాష్, జనరల్ సెక్రటరీ నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ కాస్తిమ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు నవీన్, హరవింద్, జాయింట్ సెక్రటరీ సురేష్ కొండల్, సెక్రటరీ రెడ్డి నాయక్ శ్రీరాములు, ట్రెజరర్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# బోనాల వేళ అల్లర్లు చేస్తే కఠిన చర్యలు

**లాలాగూడ పోలీసుల హెచ్చరిక**

**రౌడీషీటర్లు, అనుమానితులకు కౌన్సెలింగ్**



తార్నాక(ప్రశ్న న్యూస్) బోనాల పండుగ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇందులో భాగంగా లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి చిలకలగూడ ఏసిపి శశాంక్ రెడ్డి, సిఐ రవి కిరణ్ ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా, ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని పోలీసులు స్పష్టం చేశారు. బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు.

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. పాత నేర చరిత్ర ఉన్న వ్యక్తులు ఎలాంటి గొడవలకు, ఘర్షణలకు, అల్లర్లకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బోనాల సందర్భంగా మద్యం సేవించి రోడ్లపై హంగామా చేయడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, గొడవలకు దిగడం వంటి చర్యలను సహించబోమని తేల్చిచెప్పారు.

### పోలీసుల ఆదేశాలు పాటించాలి

బోనాల పండుగ రోజుల్లో ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని అధికారులు తెలిపారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో చిలకలగూడ ఏసీపీ, సీఐ, ఎస్ఐ పాల్గొని రౌడీషీటర్లు, అనుమానితులకు పలు సూచనలు చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే ఏ ప్రయత్నమైనా చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# నేత్రదానం మహాదానం

**బచ్చు రాజు నేత్రాలు సేకరణ**

**లయన్స్ క్లబ్ ఆఫ్ మేదా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**

**- లయన్ నంగునూరి సత్యనారాయణ**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) నేత్రదానం మహాదానమని, మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరు అంధులకు కంటిచూపు ప్రసాదించవచ్చని కొమురవెల్లి ఆలయ డైరెక్టర్, లయన్ నంగునూరి సత్యనారాయణ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన ఆర్యవైశ్య ఉపాధ్యాయుడు కీర్తిశేషులు బచ్చు రాజు శనివారం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న లయన్ నంగునూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో, గజ్వేల్ మెగా ఐ హాస్పిటల్ డాక్టర్ వై. స్రవంతి పర్యవేక్షణలో లయన్స్ క్లబ్ ఆఫ్ మేదా సభ్యుల సహకారంతో బచ్చు రాజు నేత్రాలను సేకరించారు. అనంతరం కంటి వైద్యుల పర్యవేక్షణలో నేత్రాలను భద్రపరిచారు. ఈ సందర్భంగా లయన్ నంగునూరి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ ఆఫ్ మేదా అధ్యక్షులు లయన్ నాగేందర్ మాట్లాడుతూ.. నేత్రదానం ద్వారా మరణించిన వ్యక్తి మరో వ్యక్తికి చూపును ప్రసాదించినవారవుతారని తెలిపారు. నేత్రదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం, అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని, మరణానంతరం తమ నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "మానవ సేవే మాధవ సేవ" అనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. నేత్రదానం చేసిన బచ్చు రాజు కుటుంబ సభ్యులను లయన్స్ క్లబ్ సభ్యులు అభినందిస్తూ, వారి నిర్ణయం మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీ యజమాన్యాలు ఆపొద్దు : హై కోర్టు

**ఫీజు బకాయిల పేరుతో విద్యార్థి భవిష్యత్తుతో చెలగాటం చట్టవిరుద్ధం**

**వికారాబాద్ లోని మహావీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలకు**

**హైకోర్టు గట్టి చురకలు**

**బకాయిలుంటే చట్టపరంగా వసూలు చేసుకోవాలి. సర్టిఫికెట్లు మాత్రం వెంటనే ఇవ్వాల్సిందే**

**ఫీజు రికవరీ పేరుతో విద్యార్థుల సర్టిఫికెట్లు బందీ చేసే అధికారం ఎవరికి లేదు**

**హైకోర్టు తీర్పుతో ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు**




హైదరాబాద్(ప్రశ్న న్యూస్)ఫీజు బకాయిల పేరుతో విద్యార్థుల సర్టిఫికెట్లను కాలేజీల్లో బందీగా పెట్టుకోవడం ఇక చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయలేదన్న కారణంతో విద్యార్థి సమర్పించిన విద్యా ధ్రువపత్రాలను తన వద్దే ఉంచుకోవడం చట్టవిరుద్ధమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఫీజు బకాయిలు ఉంటే వాటిని చట్టబద్ధమైన మార్గాల్లో వసూలు చేసుకోవాలని, విద్యార్థి సర్టిఫికెట్లను మాత్రం అడ్డుపెట్టుకోవద్దని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వికారాబాద్ లోని మహావీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో హైదరాబాద్ కు చెందిన డాక్టర్. అద్వైత బోర్రే తన అడ్మిషన్ సమయంలో సమర్పించిన సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వాలని కోరినా కాలేజీ యాజమాన్యం నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఫీజు బకాయిలు చెల్లించే వరకు ధ్రువపత్రాలు ఇవ్వబోమంటూ కాలేజీ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన సవాల్ చేశారు. పిటిషనర్ తరఫున హైకోర్టు సీనియర్ డెసిగ్నేటెడ్ కౌన్సిల్ బ్రహ్మాండి రమేష్ వాదనలు వినిపించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణ చేపట్టి ఇటీవల తీర్పు వెలువరించారు. అడ్మిషన్ సమయంలో విద్యార్థి 10వ తరగతి మార్కుల జాబితా, ఇంటర్మీడియట్ మెమో, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, ఇన్టెన్షిప్ కంప్లీషన్ ధ్రువపత్రాలు, జాబితాలను కాలేజీకి సమర్పించినట్లు కోర్టు గుర్తించింది.

### సర్టిఫికెట్లను అడ్డుపెట్టుకునే హక్కు ఎవరికి లేదు

ఫీజు బకాయిలు ఉన్నాయనే కారణంతో విద్యార్థి అసలు ధ్రువపత్రాలను నిలిపివేయడం సరైన పద్ధతి కాదని హైకోర్టు స్పష్టం చేసింది. బకాయిలు వసూలు చేసుకోవాలంటే కాలేజీ యాజమాన్యం చట్టబద్ధమైన మార్గాలను అనుసరించాల్సిందే తప్ప విద్యార్థి భవిష్యత్తును అడ్డుకునేలా సర్టిఫికెట్లను బందీగా పెట్టుకోవడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. తీర్పు ప్రతి అందిన వారంలోగా పిటిషనర్‌కు చెందిన అన్ని ధ్రువీకరణ పత్రాలను తిరిగి అందజేయాలని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీకి హైకోర్టు ఆదేశించింది.

### ఫీజు కోసం విద్యార్థుల భవిష్యత్తును బందీ చేయొద్దు

విద్యార్థి ఉన్నత విద్య, ఉద్యోగం, తదుపరి చదువులకు సర్టిఫికెట్లు కీలకం. అలాంటి ధ్రువపత్రాలను ఫీజు బకాయిల పేరుతో నిలిపివేయడం విద్యార్థి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే చర్యగా హైకోర్టు తాజా తీర్పు లో పేర్కొంది. ఈ తీర్పుతో విద్యాసంస్థలు విద్యార్థుల సర్టిఫికెట్లను బందీ చేసే విధానాలకు గట్టి హెచ్చరికగా మారింది. ఏ విద్యాసంస్థ అయిన విద్యార్థుల సర్టిఫికెట్లను బంధి చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హైకోర్టు తీర్పు పై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఎక్లాస్పూర్ జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా బోనాల జాతర





మంథని( ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఎక్లాస్ పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రోజున బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామంలోని అమ్మవారి ఆలయానికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. విద్యార్థులు బోనాలతో పాటు పోతరాజుల వేషధారణలో పాల్గొని, డప్పుల నడుమ ఉత్సాహంగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బోనాల పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, పోతరాజుల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొడ్డు రజిత శ్రీనివాస్, ఎస్ఎంసీ కమిటీ అధ్యక్షురాలు స్వరూప, పాఠశాల సిబ్బంది సంతోష్ కుమార్, శ్రీనివాస్, రాజశేఖర్, మంజుల, అనిత, ఎం. రాజశేఖర్, , పి.ఈ.టి దొమ్మేటి రవి ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో వీధి కుక్కలు, కోతులు, పందుల బెడద

**జంతువుల భయంతో వణుకుతున్న గజ్వేల్, ప్రజ్ఞాపూర్ ప్రజలు**

**ప్రమాదాలు జరిగేలోపే చర్యలు తీసుకోవాలని డిమాండ్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో వీధి కుక్కలు, కోతులు, పందుల సంచారం రోజురోజుకూ పెరుగుతుండటంతో పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కాలనీలు, ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు, కోతుల కారణంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు, ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రాణభయంతో రాకపోకలు సాగిస్తున్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో పందుల సంచారం అధికమవడంతో పారిశుధ్య పరిస్థితులు మరింత దిగజారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండటం, అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడేలోపే మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలకు సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించి, రాబిస్ నిరోధక టీకాలు వేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కోతులు, పందులను జనావాసాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల వ్యాప్తి పెరిగి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రతి వార్డులో డ్రెయిన్లను శుభ్రపరచడంతో పాటు క్రమం తప్పకుండా ఫాగింగ్, యాంటీ లార్వా పిచికారీ చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణ ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కమిషనర్, పారిశుధ్య అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి వీధి జంతువుల నియంత్రణతో పాటు పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ ప్రజలు కోరుతున్నారు.



# పోలీస్ అసోసియేషన్ రిప్రజెంటేటివ్ మెంబర్‌గా వీణా కుమారి ఏకగ్రీవ ఎన్నిక

**గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానం**

**గజ్వేల్ ఏసీపీ నర్సింలు, గజ్వేల్ సీఐ రవికుమార్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ పోలీస్ అసోసియేషన్ రిప్రజెంటేటివ్ మెంబర్‌గా గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ వీణా కుమారి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో సహచర పోలీసు సిబ్బంది ఆనందోత్సాహాల మధ్య వేడుకలు నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఏసీపీ నర్సింలు, గజ్వేల్ సీఐ రవికుమార్, రాయపోల్ ఎస్సై మానస కలిసి వీణా కుమారిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అన్ని సర్కిళ్లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం రిప్రజెంటేటివ్‌గా వీణా కుమారి సమర్థవంతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# కింద పడ్డ బారికేడ్లను సరిచేసిన సాయిపేట శ్రీనివాస్

**వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు,స్థానికుల ప్రశంసలు**




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో రహదారిపై నూతనంగా నిర్మించిన మ్యాన్‌హోల్‌కు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు కిందపడిపోవడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని గమనించిన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ వెంటనే స్పందించి, కిందపడిపోయిన బారికేడ్లను స్వయంగా పైకి లేపి సరిచేశారు. మ్యాన్‌హోల్ ప్రాంతంలో బారికేడ్లు సక్రమంగా లేకపోతే రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా వాటిని పక్కకు సర్దుతూ, మ్యాన్‌హోల్‌కు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టారు. ప్రజల సమస్యను గుర్తించి సంబంధిత అధికారులు వచ్చే వరకు వేచి చూడకుండా తక్షణమే స్పందించడం ద్వారా సాయిపేట శ్రీనివాస్ తన బాధ్యతాయుత వైఖరిని, మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, రహదారులపై ఇటువంటి ప్రమాదకర పరిస్థితులు కనిపించినప్పుడు వెంటనే స్పందించాలని స్థానికులు పేర్కొన్నారు. సాయిపేట శ్రీనివాస్ స్పందించిన తీరును పలువురు అభినందించారు. ఈ యొక్క కార్యక్రమంలో 299 డివిజన్ ఎస్సి సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్, లేబర్ సెల్ అధ్యక్షులు కావాలి భాస్కర్, అనిల్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# అడవే ఆవాసం..ప్రకృతే జీవనం

**- ఆదివాసీ హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలకు గుర్తింపే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం**

**- ఆగస్టు 9న ప్రపంచవ్యాప్తంగా వేడుకలు అభివృద్ధితోపాటు అస్తిత్వ పరిరక్షణకు పిలుపు**

(టి.వెంకట్ ప్రజాప్రశ్న బ్యూరో చీఫ్ ఆంధ్ర ప్రదేశ్)



అడవితో అనుబంధం.. ప్రకృతితో సహజీవనం.. తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న ప్రత్యేక సంస్కృతి.. సంప్రదాయ జీవన విధానం.. ఇవన్నీ ఆదివాసీ సమాజానికి ప్రత్యేక గుర్తింపును ఇస్తాయి. ప్రపంచవ్యాప్తంగా విభిన్న ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ సమూహాల హక్కులు, సంస్కృతి, భాష, సంప్రదాయాలు, జీవన విధానాల పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవాన్ని ప్రకటించడం వెనుక ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రపంచవ్యాప్త చర్చకు వేదిక కల్పించాలన్న ఉద్దేశం ఉంది. ఆదివాసీల అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక ప్రగతి మాత్రమే కాకుండా.. వారి భూమి, అటవీ వనరులు, భాష, సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక హక్కులను కాపాడుతూ సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రధాన లక్ష్యం.

### ఆగస్టు 9 ఎందుకు.?

1982 ఆగస్టు 9న జెనీవాలో ఆదివాసీలకు సంబంధించిన సమస్యలపై ఐక్యరాజ్యసమితి వర్కింగ్ గ్రూప్ సమావేశం నిర్వహించింది. అటవీ వనరులు, మానవ హక్కులు, భూమి, జీవనోపాధి వంటి అంశాలపై ఆదివాసీ సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీల హక్కుల పరిరక్షణకు మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఈ చర్చల ద్వారా స్పష్టమైంది. దీని కొనసాగింపుగా ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 1994లో ఆగస్టు 9ను అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఈ రోజును నిర్వహిస్తూ ఆదివాసీ సమాజాల సమస్యలు, హక్కులు, అభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

**ప్రకృతికి రక్షకులు** ఆదివాసీ సమాజాల జీవన విధానంలో ప్రకృతికి అత్యంత ప్రాధాన్యం ఉంది. అడవులు, కొండలు, నదులు, వాగులు, వన్యప్రాణులు, ఔషధ మొక్కలతో వారికి తరతరాలుగా అనుబంధం ఉంది. అటవీ వనరులను తమ జీవనోపాధికి వినియోగించుకుంటూనే ప్రకృతి సమతుల్యతను కాపాడే సంప్రదాయ జ్ఞానం అనేక ఆదివాసీ సమూహాల్లో కనిపిస్తుంది.

విత్తనాల సంరక్షణ, అటవీ ఉత్పత్తుల సేకరణ, సంప్రదాయ వైద్యం, ప్రకృతి ఆధారిత జీవన విధానం వంటి అంశాల్లో ఆదివాసీ సమాజాల పరిజ్ఞానం ప్రత్యేకమైనది. ఆధునిక ప్రపంచం పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెడుతున్న సమయంలో ఆదివాసీల సంప్రదాయ జ్ఞానం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

**అస్తిత్వం.. అభివృద్ధి రెండూ అవసరమే** ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, రహదారులు, తాగునీరు, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో అభివృద్ధి పేరుతో వారి భూములు, జీవనాధారాలు, సాంస్కృతిక గుర్తింపులు దెబ్బతినకుండా చూడటం కూడా అంతే ముఖ్యం. ఆదివాసీ పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు వారి మాతృభాషలు, సంప్రదాయ జ్ఞానాన్ని కూడా పరిరక్షించాల్సిన అవసరం ఉంది. ఆరోగ్య సేవలు మారుమూల ప్రాంతాలకు చేరాలి. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించాలి. మహిళలకు ఆర్థికంగా స్వావలంబన కల్పించే కార్యక్రమాలు విస్తరించాలి.

**భాష.. సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు** ప్రతి ఆదివాసీ సమూహానికీ ప్రత్యేకమైన భాష, పాటలు, నృత్యాలు, కళలు, ఆచారాలు, పండుగలు ఉంటాయి. ఇవి కేవలం వినోద సాధనాలు కావు.. తరతరాల చరిత్రను, జీవన అనుభవాలను భవిష్యత్ తరాలకు అందించే సాంస్కృతిక వారసత్వం.

ఆధునికీకరణ ప్రభావంతో కొన్ని ఆదివాసీ భాషలు, సంప్రదాయాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. అందుకే వారి భాషలను నమోదు చేయడం, పాఠశాల స్థాయిలో ప్రోత్సహించడం, జానపద కళలకు వేదికలు కల్పించడం, సంప్రదాయాలను డిజిటల్ రూపంలో భద్రపరచడం వంటి చర్యలు అవసరం.

**హక్కులపై అవగాహనే లక్ష్యం** అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం ఒక ఉత్సవం మాత్రమే కాదు.. ఆదివాసీ సమాజాల హక్కులను గుర్తుచేసే రోజు. భూమి, అటవీ వనరులు, విద్య, వైద్యం, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, సాంస్కృతిక హక్కులపై అవగాహన పెంచాల్సిన సందర్భం. ఆదివాసీ సమాజాలను అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను చేయడం, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడం, వారి జీవన విధానాన్ని గౌరవించడం ద్వారా మాత్రమే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది.

అడవిని కాపాడే చేతులను.. ప్రకృతితో సహజీవనం చేసే జీవన విధానాన్ని.. తరతరాలుగా కొనసాగుతున్న సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఆగస్టు 9 అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ హక్కులు, అస్తిత్వం, ఆత్మగౌరవం, అభివృద్ధిపై సమాజంలో మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉంది.

# పేరు గొప్ప.. ఊరు దిబ్బ

**- కోట మైసమ్మ గుడి ముందే గుంతల మయం**

**- ప్రజల ఇబ్బందులు పట్టించుకోని మున్సిపల్ పాలకవర్గం, అధికారులు**

**- తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు నీరుడి స్వామి**








గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )దేశంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా చెప్పుకునే గజ్వేల్ పట్టణంలో రోడ్ల పరిస్థితి అత్యంత అధ్వానంగా మారిందని తెలంగాణ జన సమితి పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నీరుడి స్వామి విమర్శించారు. పట్టణంలో ఎక్కడ చూసినా గుంతలు, అధ్వానమైన రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ముఖ్యంగా కోట మైసమ్మ ఆలయం ముందు రహదారి గుంతలమయంగా మారడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మార్గంలో ప్రతిరోజూ ఆలయానికి వచ్చే భక్తులతో పాటు పాండవుల చెరువు, పరిసర గ్రామాలకు వెళ్లే ప్రజలు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. రోడ్డు సమస్యను పలుమార్లు అధికారులు, మున్సిపల్ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని నీరుడి స్వామి ఆరోపించారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు, కమిషనర్ కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీలో పాలకవర్గం ఉన్నా లేనట్టుగా పరిస్థితి తయారైందని విమర్శించారు.

### 20 వార్డుల్లో సమస్యలు

### పరిష్కరించాలి

గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, మున్సిపల్ పాలకవర్గం తక్షణమే గుర్తించి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రోడ్లు, పారిశుధ్యం, డ్రైనేజీ తదితర మౌలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గజ్వేల్ నియోజకవర్గానికి గతంలో ప్రాధాన్యత ఉన్నప్పటికీ ప్రస్తుతం ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని నీరుడి స్వామి విమర్శించారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. “ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం సరికాదన్నారు. గజ్వేల్ పట్టణంలోని 20 వార్డుల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలిని లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని నీరుడి స్వామి హెచ్చరించారు.

# వైభవంగాతెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఢిల్లీ గ్లోబల్ స్కూల్ లో బోనాలు




మేడ్చల్( ప్రశ్న న్యూస్) తెలంగాణ సాంస్కృతిని ప్రతిబింబించేలా ఢిల్లీ గ్లోబల్ స్కూల్ లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిని ఆత్మని ప్రతివేమించే బోనాల పండుగను జీడిమెట్ల విలేజ్ లోని ఢిల్లీ గ్లోబల్ స్కూల్లో శనివారం వైభవంగా నిర్వహించారు.

పాఠశాల ప్రాంగణం పండగ వాతావరణాన్ని తలపించేలా అలంకరించగా విద్యార్థి విద్యార్థినులు సాంప్రదాయ వస్త్రాదరణలో బోనాలు ఎత్తుకొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు డప్పు చప్పులు జానపద నృత్యాలు సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది, ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ నాగూర్ బాబు మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను గొప్పదనాన్ని చాటిచెప్పే ఆధ్యాత్మిక పండుగ అని పేర్కొన్నారు ఈ పండుగ తెలంగాణలోని కాకుండా ప్రపంచవ్యాప్తంగా మన సంస్కృతి సాంప్రదాయాలను చాటి చెప్పిందని అన్నారు, తమ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు చదువులోనే కాకుండా సాంస్కృతి సాంప్రదాయాలలో, సంస్కారంలో ముందుండాల తమ మూలాలను సాంస్కృతిక విలువలను పరిరక్షిస్తూ సమాజానికి తమ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు, విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు, భక్తి గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి పాఠశాల డైరెక్టర్ నాగూర్ బాబు, శశికాంత్ శర్మ, ప్రిన్సిపల్ అశ్విని, టీచర్స్, బోధ నేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజీ, ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి డివిజన్ మైసమ్మగూడ లోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థుల్లో వ్యవస్థాపకత, స్టార్టప్ ఇంక్యుబేషన్, మెంటార్‌షిప్, ఆవిష్కరణలు, పరిశోధన అంతర్జాతీయ సహకార అవకాశాలను బలోపేతం చేసే లక్ష్యంతో ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఈ అవగాహన ఒప్పందం మార్పిడి కార్యక్రమం ఫౌండర్ చైర్మన్, ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఐటీ సలహాదారు, డాక్టర్ జె ఏ చౌదరి, ప్రొఫెసర్ వి. కామాక్షి ప్రసాద్, సీనియర్ ప్రొఫెసర్, సిఎస్ సి డైరెక్టర్ – అకడమిక్ అండ్ ప్లానింగ్ జేఎన్టీయూహెచ్ సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమంలో టి. బాలా రెడ్డి, చైర్మన్ టి. వి. రెడ్డి, సెక్రటరీ టి. సరోజా రెడ్డి టి. అనురాగ్ రెడ్డి, డైరెక్టర్లు; డా. కె. వెంకట రావు, ప్రిన్సిపాల్; డా. గౌతమ్ మామిడిశెట్టి, డీన్ -- ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్; డా. కె. రాజీవ్, లీడ్ కోఆర్డినేటర్ సాయి, ఐ ఎస్ ఎఫ్ లీడ్ కోఆర్డినేటర్ ఒ ఇన్ఫినిటీరోన్ ఏఐ వ్యవస్థాపకుడు పాల్గొన్నారు. ఈ ఎం ఓ యు ద్వారా స్టార్టప్ మెంటార్‌షిప్ ఇంక్యుబేషన్, పరిశోధనా ప్రాజెక్టులు, నాలెడ్జ్ షేరింగ్, కాన్ఫరెన్సులు, సెమినార్లు, గ్లోబల్ ఫండింగ్ అవకాశాలు వ్యూహాత్మక భాగస్వామ్యాలలో ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఈ భాగస్వామ్యం సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజీలో బలమైన వ్యవస్థాపకత ఆవిష్కరణల ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడంలో కీలక ముందడుగుగా నిలుస్తుందని, విద్యార్థులకు స్టార్టప్ అభివృద్ధి, నిపుణుల మెంటార్‌షిప్, పరిశోధన మరియు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను మరింత విస్తృతంగా అందించేందుకు దోహదపడుతుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

## రావల్ కోల్ భారీ చోరీ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధి రావల్ కోల్ లో భారీ చోరీ జరిగింది. ఈ చోరీలో 9 తులాల బంగారం, 80 తులాల వెండి రూ. 2 లక్షల నగదును దోచుకెళ్లినట్టు సమాచారం. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. రావల్ కోల్ కు చెందిన బంధ్యాల ముత్యాలు తన కుటుంబ సభ్యులతో ఊరికి వెళ్లారు. దొంగలు ఇంటికి ఉన్న తాళం పగలగొట్టి ఇంట్లోని 9 తులాల బంగారం, 80 తులాల వెండి, రూ., 2 లక్షల నగదు దోచుకెళ్లినట్టు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. అయితే ఈ కుటుంబం గురించి తెలిసిన వారే ఈ దొంగతనానికి పాల్పడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ దొంగతనపై సమగ్ర విచారణ చెప్తామని మేడ్చల్ సీఐ అంజిరెడ్డి పేర్కొన్నారు.

## నల్ల పోచమ్మ దుర్గమ్మ తల్లి బోనాల శుభాకాంక్షలు

### మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ ప్రజలకు నల్ల పోచమ్మ తల్లి,దుర్గమ్మ తల్లి బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా,సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్, ఉమ్మడి మేడ్చల్ మండల, మేడ్చల్ డివిజన్ ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, అనధికారులకు,పుర ప్రముఖులకు, నాయకులకు,కార్యకర్తలకు, పోలిస్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు,మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ప్రజలందరికీ నల్ల పోచమ్మ తల్లి,దుర్గమ్మ తల్లి బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు,మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ తెలిపారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయలకు నిలువెత్తు నిదర్శనం బోనాల పండుగ అని తెలుపుతూ బోనాలు ప్రజల ఐక్యతను,ఆధ్యాత్మిక విలువలను ప్రతిబింబిస్తూ,ఎంతో భక్తిశ్రద్దలతో జరుపుకునే పండగ అని కోరిన కోరికలు నెరవేరుస్తూ కొంగు బంగారమైన గ్రామ దేవతలను పూజించడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధించడంతోపాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.

## 10 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించిన చైర్ పర్సన్ లావుడ్యా శ్రీదేవి రమేష్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని 9వ వార్డు సైధోనిగడ్డ తాండా ప్రాంతంలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ లావుడ్యా శ్రీదేవి రమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ప్రతి వార్డుకు రూ. 10 లక్షలను కేటాయించామని ఈ నిధులతో వార్డులలోని డ్రైనేజీ పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీ పనులను నాణ్యతతో చేపట్టాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మలోత్ రజిత రాజేందర్ నాయక్, ఎల్లంపేట మున్సిపల్ అధికారులు రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ నేతలు రాజు, రాజేందర్ వివిధ వార్డుల కౌన్సిలర్లు, స్థానిక ప్రజలు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చల్లవారిపాలెం--జాతీయ రహదారి 16కు కొత్త దారి

- రూ.3.55 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభం
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో రూ.1,700 కోట్లకు పైగా అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



**గుంటూరు(ప్రశ్న న్యూస్)** ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న చల్లవారిపాలెం జంక్షన్ నుంచి జాతీయ రహదారి--16 సర్వీస్ రోడ్డు వరకు మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్--4లో భాగంగా నిర్మించిన బీటీ రోడ్డు అందుబాటులోకి వచ్చింది. రూ.3.55 కోట్ల సీఆర్‌డీఏ నిధులతో నిర్మించిన ఈ రహదారిని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు శనివారం ప్రారంభించారు.

**రవాణా సౌకర్యం మెరుగు** చల్లవారిపాలెం నుంచి జాతీయ రహదారి--16 వరకు నూతన రహదారి అందుబాటులోకి రావడంతో పరిసర ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. స్థానిక ప్రాంతాల నుంచి జాతీయ రహదారికి అనుసంధానం మరింత సులభతరం కానుంది. రహదారి అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని అధికారులు, స్థానికులు పేర్కొన్నారు.మౌలిక వసతులకు ప్రాధాన్యంఈ సందర్భంగా ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పెండింగ్ పనులను గుర్తించి నిధులు సమకూర్చి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ చొరవతో సీఆర్‌డీఏ నిధులు మంజూరై రూ.3.55 కోట్లతో రహదారి నిర్మాణం పూర్తయిందన్నారు. గుంటూరు నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.చల్లవారిపాలెం జంక్షన్ నుంచి జాతీయ రహదారి--16 వరకు కీలక అనుసంధాన రహదారి అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. ఈ రహదారి వల్ల పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి కార్యకలాపాలు ఊపందుకునే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనిని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీపై వైసీపీది రాజకీయ డ్రామా

- న్యాయపోరాటంలో నెగ్గలేకే వీధిపోరాటాలు: ప్రత్తిపాటి
- కోర్టు ఆదేశాలు, అధికారుల వివరణల కంటే జగన్‌కు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం



గుంటూరు(ప్రశ్న న్యూస్) మెగా డీఎస్సీ అంశాన్ని వైఎస్సార్‌సీపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. న్యాయస్థానాలు, అధికారులు ఇప్పటికే స్పష్టత ఇచ్చినా.. వైసీపీ నేతలు అదే అంశాన్ని పట్టుకుని నిరసనలకు దిగడం రాజకీయ డ్రామాలో భాగమేనని విమర్శించారు. న్యాయపోరాటంలో సరైన ఆధారాలు లేకపోవడంతోనే వీధిపోరాటాల పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### "యువత భవిష్యత్తుతో చెలగాటం"

డీఎస్సీ వ్యవహారంలో యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాల్సిన ప్రతిపక్షం.. రాజకీయ లబ్ధి కోసం అంశాన్ని వివాదాస్పదం చేస్తోందని ప్రత్తిపాటి అన్నారు. ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన వివరణలను పట్టించుకోకుండా ఆరోపణలు కొనసాగించడం సరికాదన్నారు. నిరసన దీక్షల పేరుతో ప్రజా జీవనానికి ఇబ్బందులు కలిగించడం వైసీపీ రాజకీయ వ్యూహంలో భాగమని విమర్శించారు.

### "అసెంబ్లీలో ఆధారాలు బయటపెట్టాలి"

మెగా డీఎస్సీలో అర్హులకు అన్యాయం జరిగిందని వైసీపీ నేతలు చెబుతున్నారని, అందుకు సంబంధించిన ఆధారాలు ఉంటే వాటిని అసెంబ్లీలో బహిర్గతం చేయాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు. ఎంపిక చేసుకున్న మీడియా వేదికలపై ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం కాకుండా.. చట్టసభలో వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని సూచించారు.

### 'పాడిందే పాటగా వ్యవహారం..

మెగా డీఎస్సీపై న్యాయస్థానాలు, ప్రభుత్వం, అధికారులు వివరణ ఇచ్చినప్పటికీ వైసీపీ తన వైఖరిని మార్చుకోవడం లేదని ప్రత్తిపాటి విమర్శించారు. "న్యాయస్థానాలు చీవాట్లు పెట్టినా.. ప్రభుత్వం, అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చినా అదే అంశాన్ని పట్టుకుని రాజకీయాలు చేయడం సరికాదు" అని అన్నారు.డీఎస్సీ నియామకాల్లో తప్పులు జరిగాయని నిరూపించే ఆధారాలు ఉంటే వాటిని చట్టసభలో ప్రవేశపెట్టి చర్చకు సిద్ధం కావాలని జగన్‌కు సవాల్ చేశారు. మీడియా సమావేశాలు, వీధి నిరసనలకే పరిమితం కాకుండా అసెంబ్లీలో ఆధారాలతో మాట్లాడి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా తెలంగాణ బంధు పండుగ సాయన్న జయంతి వేడుకలు



**శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)** ప్రజా వీరుడు -- తెలంగాణ బందూక్ పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకొని చందానగర్లోని శాంతి నగర్లో సతీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముదిరాజ్ సంఘ నాయకులు కొంగరి కృష్ణ ముదిరాజ్, అనిల్ కుమార్ ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, రేవంత్ ముదిరాజ్ నాగరత్నం ముదిరాజ్ లు హాజరై పండగ సాయన్న చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడిన మహావీరుడు, తెలంగాణ గర్వకారణం ప్రజా వీరుడు పండుగ సాయన్న అన్నారు. రాబిన్ హుడ్ గా పేరు గాంచిన తెలంగాణ సాయుధా పోరాట యోధుడు, బ్రిటీష్ వాళ్ళను తరిమి కొట్టిన వీరుడు సామజిక దృక్ పాదంతో ఎంతో మందికి సహాయం చేసిన వ్యక్తి, రజాకార్లను, అక్కడ ఉన్నటువంటి దొరలను వాళ్ళను విడనది మహబూబ్నగర్ జిల్లాలో పెద్ద ఎత్తున పోరాటం చేసిన వీరుడు, ముదిరాజ్ ముద్దు బిడ్డ మహబూబ్ నగర్లో పుట్టిన ఇతను దేశ ప్రజల్లో రాబిన్ హుడ్, తెలంగాణ రాబిన్ హుడ్ గా పెరుగనచ్చిండు. అయన ఆశయాలను కొంసాగించాల కోరడం జరుగుతుంది. అయన జయంతిని ప్రతి సంవత్సరం ఆగస్టు 08న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలు, మండలాలు, పట్టణాలు, జిల్లా కేంద్రాల్లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల బాగోగుల కోసం తన జీవితాన్ని అంకితం చేసి, పెత్తందారీ వ్యవస్థను ధైర్యంగా ఎదిరించిన పండుగ సాయన్న స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకం. ఆయన త్యాగం, ధైర్యం, ప్రజాసేవ, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు.తెలంగాణ ప్రభుత్వం పండుగ సాయన్న సేవలను అధికారికంగా మరింత గుర్తించి, ఆయన చరిత్రను భావితరాలకు చేరేలా తగిన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో నందు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమలో అనుమానం.. ప్రాణం తీసిన వైనం

- యువతి అదృశ్యం కేసులో నిందితుడి అరెస్టు
- కారంపూడికి పిలిచి.. నిర్మానుష్య ప్రాంతంలో హత్య చేసినట్లు పోలీసుల వెల్లడి



చిలకలూరిపేట(ప్రశ్న న్యూస్) ప్రేమ వ్యవహారంలో తలెత్తిన అనుమానం ఓ యువతి ప్రాణాలను బలిగొన్నట్లు పోలీసులు తెలిపారు. తనను దూరం పెడుతోందన్న అనుమానంతో యువతిని కారంపూడికి పిలిపించి, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడిని చిలకలూరిపేట పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అనంతరం మృతదేహాన్ని గుర్తుపట్టకుండా చేయాలనే ఉద్దేశంతో పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు.చిలకలూరిపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 214/2026లో బీఎన్ఎస్ సెక్షన్లు 103(1), 140(1), 238 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.నాలుగేళ్ల పరిచయంపోలీసుల వివరాల ప్రకారం.. మృతురాలు షేక్ హసీనా అలియాస్ యాస్మిన్ (23) బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం చేస్తోంది. నిందితుడు జనగు బాల సైములు అలియాస్ బాలు (25) గతంలో ఇంజినీరింగ్ చదువుకున్నాడు. చదువుకునే సమయంలో వీరిద్దరికీ పరిచయం ఏర్పడి సుమారు నాలుగేళ్లుగా ప్రేమ సంబంధం కొనసాగినట్లు పోలీసులు తెలిపారు.ఇటీవల యువతి తనతో మాట్లాడటం తగ్గించిందని, మరో వ్యక్తితో పరిచయం పెంచుకుని తనను దూరం పెడుతోందని నిందితుడు అనుమానించినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు.మాట్లాడుకుందామని పిలిచిఆగస్టు 4న ఉదయం యువతికి ఫోన్ చేసిన నిందితుడు మాట్లాడుకుందామని చెప్పి కారంపూడికి పిలిపించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతానికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.కారంపూడి నుంచి నక్కల రహదారి వైపు ఉన్న ఎన్ఎస్‌పీ కాలువ సమీపంలో యువతిపై కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు పేర్కొన్నారు.నంతరం ఆధారాలు లభించకుండా చేయాలనే ఉద్దేశంతో మృతదేహంపై పెట్రోల్ పోసి, తన వద్ద ఉన్న అగ్గిపెట్టెతో నిప్పంటించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి నిందితుడు పరారైనట్లు వెల్లడించారు.యువతి అదృశ్యంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, నిందితుడి కదలికలు, ఇతర ఆధారాలపై దృష్టి సారించి కేసును ఛేదించినట్లు తెలిపారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నరసరావుపేట ఎస్‌డీపీవో ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో చిలకలూరిపేట పట్టణ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలించారు.శనివారం కారంపూడి మండలం, కారంపూడి గ్రామంలోని పాత సినిమా హాలు సెంటర్ వద్ద హోండా షోరూం సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతడిని రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.దర్యాప్తు బృందంకేసు దర్యాప్తులో చిలకలూరిపేట టౌన్ సీఐ పీ. రమేష్, ఎస్ఐ వి. సోమేశ్వరరావు, ఎస్ఐ పీ. హాజరయ్య, వారి సిబ్బంది పాల్గొన్నారు.పోలీసుల దర్యాప్తు ప్రకారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కేసుకు సంబంధించిన మిగిలిన అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# దీక్షను ఆపే యత్నం.. పోరు ఆగలేదు
# మూడో రోజూ పోలీసులతో వాగ్వాదం

- రోడ్డుపైనే బైఠాయించిన విడదల రజిని - డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణకు డిమాండ్..
- ' న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గం'






**చిలకలూరిపేట(ప్రశ్న న్యూస్)** డీఎస్సీ నియామకాల వ్యవహారం చిలకలూరిపేటలో రాజకీయ వేడిని పెంచుతోంది. నియామకాల్లో అవకతవకలు జరిగాయంటూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష మూడో రోజూ కొనసాగింది. మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో సాగుతున్న దీక్షను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. దీక్షకు అనుమతులు లేవంటూ పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించగా.. పార్టీ నాయకులు, కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

పోలీసుల రంగప్రవేశంతో ఉద్రిక్తత

దీక్షా శిబిరం వద్దకు పోలీసులు చేరుకుని అనుమతుల అంశాన్ని ప్రస్తావించడంతో పరిస్థితి ఒక్కసారిగా మారింది. నిరసనను విరమించి అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు సూచించినట్లు వైఎస్సార్‌సీపీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే దీక్ష కొనసాగిస్తామని విడదల రజిని స్పష్టం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, పార్టీ శ్రేణుల మధ్య మాటామాటా పెరిగింది.

దీక్షా వేదిక నుంచి విడదల రజినిని తరలించే క్రమంలో తోపులాట చోటుచేసుకుందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ఈ సమయంలో ఆమె కిందపడిపోయారని పేర్కొన్నారు. మహిళా నాయకురాలితో పోలీసులు వ్యవహరించిన తీరుపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

**'మేమేం తప్పు చేశాం?'** ఘటనపై విడదల రజిని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "మేము ఏం తప్పు చేశామని ఇంత చేస్తున్నారు? ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్నాం. అన్ని రోజులు ఒకేలా ఉండవు" అంటూ పోలీసుల తీరుపై ప్రశ్నించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు ఉందని ఆమె పేర్కొన్నారు.

**రోడ్డుపైనే బైఠాయింపు** పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించినప్పటికీ విడదల రజిని వెనక్కి తగ్గలేదు. దీక్షా శిబిరం వద్ద రోడ్డుపైనే బైఠాయించి రిలే నిరాహార దీక్షను కొనసాగించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు మద్దతుగా కూర్చున్నారు. దీంతో చిలకలూరిపేటలో రాజకీయంగా మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**డీఎస్సీపై రాజకీయ దుమారం** డీఎస్సీ నియామకాలు ఇప్పుడు అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ పోరాటానికి కేంద్రంగా మారుతున్నాయి. నియామక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగలేదని ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ.. ప్రతిపక్ష పార్టీలు మాత్రం పలు అంశాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా నియామకాలపై వస్తున్న ఆరోపణలను వైఎస్సార్‌సీపీ ప్రధానంగా ప్రస్తావిస్తోంది.నియామక ప్రక్రియపై అభ్యర్థుల్లో నెలకొన్న సందేహాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. మరోవైపు ఆరోపణలు రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్నవేనని అధికారపక్షం వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీంతో డీఎస్సీ అంశం ఉద్యోగ నియామకాలకే పరిమితం కాకుండా రాజకీయ వివాదంగా మారింది.

**సీబీఐ దర్యాప్తు కోరుతున్న వైఎస్సార్‌సీపీ** డీఎస్సీ నియామకాల్లో ఆరోపణలపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని విడదల రజిని డిమాండ్ చేశారు. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా నియామకాలపై వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. అభ్యర్థులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**మంత్రి రాజీనామాకు డిమాండ్** డీఎస్సీ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని విడదల రజిని డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియపై ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని, అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని కోరారు.

**స్థానిక రాజకీయాల్లో వేడి** చిలకలూరిపేట నియోజకవర్గంలో విడదల రజిని చేపట్టిన దీక్షకు మూడో రోజు కూడా పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరవడంతో స్థానిక రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది. ఒకవైపు డీఎస్సీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ ప్రయత్నిస్తుండగా.. మరోవైపు ప్రభుత్వ నిర్ణయాలను సమర్థిస్తూ అధికారపక్షం ముందుకు సాగుతోంది. దీక్షను అడ్డుకోవడం, పోలీసులు-ఆందోళనకారుల మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం రాజకీయంగా మరింత చర్చకు దారితీసే అవకాశముంది. రాబోయే రోజుల్లో ఈ అంశంపై వైఎస్సార్‌సీపీ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తుందా? ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.'న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం' అని విడదల రజిని ప్రకటించడంతో.. డీఎస్సీ వివాదం చిలకలూరిపేటలో మరికొంతకాలం రాజకీయ వేడిని కొనసాగించే సూచనలు కనిపిస్తున్నాయి.

# మీ సురక్ష సహచరి'

### సహచరి గ్రూపు సభ్యులతో మేడిపల్లి పోలీసుల అవగాహన సమావేశం



బోడుప్పల్(ప్రశ్న న్యూస్) నేరాల నియంత్రణ,మహిళల భద్రత,సైబర్ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.జలేంధర్ రెడ్డి అన్నారు.'మీ సురక్ష సహచరి'కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమాజ భాగస్వామ్య పోలీసింగ్‌లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో మేడిపల్లి పోలీసులు సహచరి గ్రూపు సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.జలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల భద్రత,రోడ్డు భద్రత,నేరాల నివారణ,సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడం,డ్రగ్స్,బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం,దొంగతనాల నియంత్రణ తదితర అంశాలపై సహచరి గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించారు.ఆన్‌లైన్ మోసాలు,అనుమానాస్పద ఫోన్ కాల్స్,ఓటీపీలు,నకిలీ లింకులు,డిజిటల్ లావాదేవీల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.అలాగే మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తమ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ప్రజలు,పోలీసుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంలో సహచరి గ్రూపు సభ్యుల పాత్ర కీలకమని,కమ్యూనిటీ సేఫ్టీ అంబాసిడర్ గా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ,మహిళల భద్రత,సైబర్ నేరాల నివారణ,నేర నియంత్రణలో పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని సహచరి గ్రూపు సభ్యులు తెలిపారు.

### శ్రీశైలం మల్లన్న భక్తులకు
# సౌకర్యాలే ప్రధాన లక్ష్యం

- శ్రీశైల దేవస్థానంలో భక్తుల సౌకర్యాలపై ఈఓ ఎం. శ్రీనివాసరావు, చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు ప్రత్యేక దృష్టి



శ్రీశైలం ( ప్రస్నన్యూస్)శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానానికి వస్తున్న భక్తులకు ఈఓ ఎం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు తీసుకుంటున్న చర్యలు ఫలితమిస్తున్నాయి. వీకెండ్, సెలవు రోజుల్లో భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉండేందుకు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆలయ క్యూ లైన్లు, అన్నదాన సత్రం, ప్రసాద కౌంటర్లు, తాగునీటి కేంద్రాలు, వసతి గదులను ఈఓ, చైర్మన్ రోజూ స్వయంగా పరిశీలిస్తున్నారు.రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని, వాలంటీర్లను విధుల్లో నియమించారు. ఎండ వేడిమి దృష్ట్యా క్యూ లైన్లలో భక్తులకు నిరంతరం మజ్జిగ, పాలు, ఫలహారాలు, మంచినీరు ఉచితంగా అందజేస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, చిన్న పిల్లలతో వచ్చిన వారికి ప్రత్యేక దర్శన మార్గాల ద్వారా త్వరగా దర్శనం కల్పిస్తుండటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.గతంతో పోలిస్తే సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడ్డాయని, సిబ్బంది ప్రవర్తన కూడా బాగుందని , పలు రాష్ట్రాలు నుండి వచ్చిన భక్తులు అన్నారు.వచ్చిన ప్రతి భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వామివారిని దర్శించుకుని సంతృప్తితో వెళ్లాలనేదే మా లక్ష్యం. అందుకే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సిబ్బంది అవిరళంగా కృషి చేస్తున్నారు అని ఈఓ ఎం. శ్రీనివాసరావు తెలిపారు.భక్తులే మనకు దైవం. వారికి రాజమర్యాదలతో సేవలు అందించడం మా బాధ్యత. శ్రీశైల అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు మరిన్ని నిధులు కేటాయిస్తాం అని చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు అన్నారు.ఈఓ, చైర్మన్ సమన్వయంతో చేపట్టిన చర్యల వల్ల శ్రీశైలంలో భక్తులకు దర్శనం సులభంగా, సంతోషంగా సాగుతోందన్నారు .

## 'రామాయణ' రిలీజ్‌లో

# ఊహించని ట్విస్ట్..

### భారత్‌లో రెండు రోజులు ఆలస్యంగానా..!



భారతీయ సినీ పరిశ్రమ నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న భారీ చిత్రాల్లో 'రామాయణ' ఒకటి. బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న ఈ మెగా ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. భారతీయ పురాణ ఇతిహాసమైన రామాయణాన్ని హాలీవుడ్ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో తెరపై ఆవిష్కరిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్, దక్షిణాది, అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులు భాగమయ్యారు. రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యష్ రావణుడిగా కనిపించనున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ ఇప్పటికే సోషల్ మీడియాలో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇటీవల 'రామాయణ' ట్రైలర్ విడుదలైన తర్వాత సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, పాత్రల లుక్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా భారతీయ ఇతిహాసాన్ని అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరువ చేసే ఉద్దేశంతో మేకర్స్ ఇంగ్లీష్ వెర్షన్ ట్రైలర్‌ను కూడా విడుదల చేశారు. ఇంగ్లీష్ ట్రైలర్‌కు అంతర్జాతీయంగా మంచి స్పందన రావడంతో ఈ ప్రాజెక్ట్‌పై గ్లోబల్ ఆడియెన్స్ దృష్టి పడింది. హాలీవుడ్ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా విజువల్ ఎఫెక్ట్స్, ప్రొడక్షన్ డిజైన్, యాక్షన్ ఎపిసోడ్స్‌ను రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమైంది. ఈ క్రమంలోనే సినిమా విడుదల తేదీ విషయంలో ఓ ఆసక్తికరమైన ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా 'రామాయణ' నవంబర్ 6న విడుదల కానుండగా.. భారత్‌లో మాత్రం నవంబర్ 8న విడుదల చేయనున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా వెల్లడించినట్లు సమాచారం. అంటే ఇతర దేశాల్లో ప్రేక్షకులు సినిమాను రెండు రోజుల ముందుగానే చూసే అవకాశం ఉండగా, భారతీయ ప్రేక్షకులు మాత్రం మరో రెండు రోజులు వేచి చూడాల్సి ఉంటుంది. సాధారణంగా భారతీయ సినిమాలు స్వదేశంలో ముందుగా లేదా అదే రోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కావడం చూస్తుంటాం. కానీ 'రామాయణ' విషయంలో దీనికి భిన్నమైన షెడ్యూల్ ఉండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. భారత్‌లోనే అత్యంత కీలకమైన కథాంశంతో తెరకెక్కుతున్న 'రామాయణ'ను స్వదేశంలో రెండు రోజుల ఆలస్యంగా విడుదల చేయడం వెనుక అసలు కారణం ఏమిటనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. విడుదల తేదీకి సంబంధించిన అధికారిక వివరాలు, దేశాల వారీగా రిలీజ్ ప్లాన్‌పై మేకర్స్ నుంచి మరింత స్పష్టత రావాల్సి ఉంది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని సినిమాను గ్లోబల్ రిలీజ్‌గా ప్లాన్ చేస్తున్న నేపథ్యంలోనే ఈ విధమైన షెడ్యూల్‌ను రూపొందించి ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఆసుపత్రి పాలైన అవికా గోర్..

# 104 డిగ్రీల జ్వరంలోనూ

### షూటింగ్ చేసిన 'చిన్నారి పెళ్లికూతురు'



టెలివిజన్ ప్రేక్షకులను ఎంతగానో అలరించిన 'బాలికా వధు' (చిన్నారి పెళ్లికూతురు) ఫేమ్ అవికా గోర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవికా గోర్ భర్త మిలింద్ చంద్వానీ సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. గత ఐదు రోజులుగా ఆమె ఏకంగా 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తన వృత్తిపై ఉన్న అంకితభావాన్ని చాటుకున్నారు. నిర్మాతలకు నష్టం జరగకూడదనే ఆలోచనతో ఆమె తీవ్ర అనారోగ్యంలోనూ షూటింగ్‌లలో పాల్గొనడమే కాకుండా, ఒక యాడ్ షూట్ కోసం ఢిల్లీకి కూడా ప్రయాణించారు. అయితే నీరసం మరియు జ్వరం మరింత పెరగడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఆమె నటించిన సరికొత్త హిందీ మ్యూజిక్ ఆల్బమ్ 'బుఖార్' (జ్వరం) విడుదలైన రోజే ఆమె నిజంగానే జ్వరంతో ఆసుపత్రిపాలవడం గమనార్హం. ఆసుపత్రి మంచంపై నుంచే తన పాట విడుదలైన విషయాన్ని అభిమానులతో పంచుకున్న ఆమె, తన ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గుతోందని, డెంగ్యూ ప్రభావం చాలా తీవ్రంగా ఉందని పేర్కొంటూ విక్టరీ సింబల్ చూపించారు. బాలనటిగా కెరీర్ ప్రారంభించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అవికా గోర్ త్వరగా కోలుకోవాలని ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.


# రామ్‌చరణ్‌కు జోడీగా?



కన్నడ సొగసరి రుక్మిణి వసంత్ తారాపథంలో దూసుకుపోతున్నది. ప్రస్తుతం ఈ భామ యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' వంటి భారీ చిత్రాల్లో నాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. 'కాంతార ఛాప్టర్–1' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో ఆమె పాపులర్ అయింది. అప్పటి నుంచి వరుసగా భారీ చిత్రాల్లో అవకాశాలు వరిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం తెలుగులో ఈ భామ మరో ప్రతిష్టాత్మక చిత్రంలో నాయికగా ఖరారుకాబోతున్నదని వార్తలొస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో రామ్‌చరణ్ తన తదుపరి చిత్రాన్ని సుకుమార్ డైరెక్షన్‌లో చేయబోతున్న విషయం తెలిసిందే. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. వచ్చే నెల లాంఛనంగా ప్రారంభించి..నవంబర్‌లో సెట్స్‌మీదకు తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం పలువురు అగ్ర నాయికల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. వారిలో రుక్మిణి వసంత్ ఖరారయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఫిల్మ్‌నగర్ టాక్. మరి ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే మేకర్స్ అధికారికంగా ధృవీకరించాల్సిందే.

## ఇప్పటివరకు

# చేయని కథ



ప్రస్తుతం సైన్స్ ఫిక్షన్ 'రాకా' సినిమాతో బిజీగా ఉన్నారు అగ్ర హీరో అల్లు అర్జున్. ముంబయిలో చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమా పూర్తయిన తర్వాత లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ ఓ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అధికారిక ప్రకటన వెలువడింది. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. డిసెంబర్‌లో ఈ సినిమా పట్టాలెక్కనుందని తెలుస్తున్నది. తాజాగా ఈ సినిమా కథాంశం గురించి ఆసక్తికరమైన అప్‌డేట్ బయటికొచ్చింది. పౌరాణిక, ఫాంటసీ అంశాలు కలబోసి సరికొత్త కథాంశమిదని, ఇప్పటివవరకు బన్నీ తన కెరీర్‌లో ఈ జోనర్‌లో సినిమా చేయలేదని వార్తలొస్తున్నాయి. అటు దర్శకుడు లోకేష్‌కు కూడా ఇది కొత్త జోనర్ చిత్రమేనని, అందుకే ఈ ప్రాజెక్ట్‌పై ఇద్దరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ సినిమాలో ఓ బాలీవుడ్ అగ్ర హీరో కూడా భాగం కాబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. మరి వీటిలో నిజమెంతో తెలియాలంటే కొద్ది రోజులు వేచిచూడాల్సిందే.



# నీకోసం నేనుంటే..

బిగ్‌బాస్ ఫేమ్ డెమాన్ పవన్, రీతూచౌదరి కలిసి నటించిన 'బంగారం' ఆల్బమ్ సాంగ్ ఇటీవలే విడుదలైంది. ఈ పాటకు సోషల్‌మీడియాలో మంచి స్పందన లభిస్తున్నది. ఆకట్టుకునే నృత్యాలు, రొమాంటిక్ వైబ్‌తో మ్యూజిక్ ఛార్ట్స్‌లో ట్రెండ్ అవుతున్నది. ఈ పాటను అఫ్రోజ్ అలీ స్వరపరచడంతో పాటు సాహిత్యాన్ని అందించారు. సమీరా భరద్వాజ్‌తో కలిసి ఆయన ఈ గీతాన్ని ఆలపించారు. 'బంగారం నీకోసం నేనుంటే నాకోసం నువ్వుంటే చాలు కదే..నా గుండెల్లో దాపెట్టుకొని కళ్లోపెట్టి చూసుకుంటా రాణివలే' అంటూ రొమాంటిక్ ఫీల్‌తో ఈ పాట సాగింది. గురువారం జరిగిన సాంగ్‌లాంచ్ ఈవెంట్‌లో డెమాన్ మాట్లాడుతూ.. డీపీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందించిన ఈ పాటకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, భవిష్యత్తులో తమ సంస్థ వెబ్‌సిరీస్‌లు, సినిమాలు నిర్మించాలని ప్లాన్ చేస్తున్నదని తెలిపారు. ఈ పాటలో భాగం కావడం ఆనందంగా ఉందని రీతూ చౌదరి పేర్కొన్నది. ఈ కార్యక్రమంలో గాయని సమీర భరద్వాజ్, సంగీత దర్శకుడు రంజిత్ రెడ్డి, కొరియోగ్రాఫర్ విజ్జు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ బంధాలకు దర్పణం



నయనతార, కెవిన్ ప్రధాన పాత్రల్లో నటించినచిత్రం 'హాయ్'. విష్ణు దర్శకత్వంలో రూపొందిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'ఇదొక ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. చెన్నై, కోయంబత్తూరు, పొల్లాచ్చి నేపథ్యంలో కథ నడుస్తుంది. కుటుంబమంతా థియేటర్‌లో చూసి ఆస్వాదించేలా ఈ చిత్రాన్ని రూపొందించాం' అని దర్శకుడు తెలిపారు. కుటుంబ బంధాలు, భావోద్వే గాలు, హాస్యం ప్రధానంగా ప్రతీ ఒక్కరి మనసుల్ని కదిలించే సినిమా ఇదని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని నయనతార, విఘ్నేష్‌శివన్, ఎస్.ఎస్.లలిత్ కుమార్ సంయుక్తంగా నిర్మించారు.

# పళ్ల బురుసు కోసం పంచాయితీ

పళ్లబురుసు కొనివ్వలేదని ఓ తండ్రి తన కొడుకుపై పోలీస్‌స్టేషన్‌లో కేసుపెడతాడు. ఇంత చిన్న విషయానికి స్టేషన్ దాకా ఎందుకొచ్చావని పోలీసులు ఆశ్చర్యపోతారు. మరి ఈ తండ్రీకొడుకుల పంచాయితీ ఏందో తెల్వాలంటే 'పళ్లబురుసు' సినిమా చూడాల్సిందే. 'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, మురళీధర్‌గౌడ్, గోమతి, ప్రజ్వల్ యాద్మ, సుజాత కీలక పాత్రల్లో నటించిన ఈ తెలంగాణ నేపథ్య చిత్రానికి ఉదయ్‌చౌహాన్ దర్శకత్వం వహించారు. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం ట్రైలర్‌ను అగ్ర నటుడు నాగార్జున విడుదల చేశారు. విడుదలకు ముందే ట్రైలర్‌ను సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం లచ్చపేట గ్రామ ప్రజల కోసం ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'ఈ సినిమా షూటింగ్ మొత్తం లచ్చపేట గ్రామంలోనే జరిపాం. అందుకే ట్రైలర్‌ను ముందుగా వారికి చూపించాం' అన్నారు. గ్రామీణ నేపథ్యంలో తండ్రీకొడుకుల అనుబంధం ప్రధానంగా ట్రైలర్ ఆకట్టుకుంది. పళ్లబురుసు కేసు వెనక అసలు కారణమేంటనే అంశం ఆసక్తినిరేకెత్తించేలా ఉంది. ఈ చిత్రానికి కెమెరా: వినోద్ కె బంగారి, సంగీతం: పవన్ సీహెచ్.



# ఇంద్రకీలాద్రిపై భక్తజన ప్రవాహం

- ఆషాఢ సారె బృందాలతో పండుగ వాతావరణం
- 65 వేల మందికి పైగా దుర్గమ్మ దర్శనం
- రద్దీకి అనుగుణంగా దర్శనాల్లో మార్పులు
- అన్ని క్యూలైన్లు ఉచిత దర్శనాలుగా మార్పు




విజయవాడ(ప్రశ్న న్యూస్) రెండో శనివారం సెలవు, ఆషాఢ మాస ఉత్సవాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. శనివారం ఉదయం నుంచే శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పరిసరాలు జనసందోహంగా మారాయి. ఘాట్‌రోడ్, శ్రీకనకదుర్గానగర్ మార్గాల మీదుగా భక్తులు పెద్ద సంఖ్యలో కొండపైకి తరలివచ్చారు. ఆషాఢ సారె బృందాల రాకతో ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.రద్దీకి అనుగుణంగా దర్శనాల్లో మార్పులుభక్తుల రద్దీ పెరగడంతో సాధారణ భక్తులకు వీలైనంత త్వరగా అమ్మవారి దర్శనం కల్పించేందుకు దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం 9 గంటల నుంచి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని రకాల దర్శన టికెట్లను రద్దు చేసి, అందుబాటులో ఉన్న క్యూ మార్గాలను ఉచిత దర్శన క్యూలైన్లుగా మార్చారు.ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు అన్ని రకాల వీఐపీ దర్శనాలను కూడా పూర్తిగా నిలిపివేశారు. దీంతో సాధారణ భక్తుల దర్శనానికి ప్రాధాన్యం కల్పించారు.తప్పిపోయిన వృద్ధురాలిని కుటుంబానికి చేర్చిన ఈవోరద్దీ మధ్య కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయిన ఓ వృద్ధురాలిని ఈవో వి.కె. శీనానాయక్ గుర్తించారు. వెంటనే మైక్ ద్వారా ప్రకటన చేయించి ఆమె కుటుంబ సభ్యులను గుర్తించి, వృద్ధురాలిని వారి చెంతకు చేర్చారు. అధికారుల అప్రమత్తతతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు, పోలీసులు సమన్వయంతో వ్యవహరించడంతో దర్శన ప్రక్రియ సజావుగా సాగింది.

# డాక్టర్ ప్రియాంక మృతి

- కారు ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలు
- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- కుమార్తెను కోల్పోయినా అవయవదానానికి తల్లిదండ్రుల అంగీకారం



రాజమహేంద్రవరం(ప్రశ్న న్యూస్) వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయాలన్న ఆమె కల విషాదాంతమైంది. రాజమహేంద్రవరంలో కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక (28) చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రసాదిత్య మాల్ సమీపంలో జరిగిన వివాదం అనంతరం మద్యం మత్తులో ఉన్న యువకులు కారుతో ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. తొలుత స్థానికంగా చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రియాంక కన్నుమూశారు.

**వైద్యురాలిగా సేవ చేయాలనే లక్ష్యంతో** గుంటూరు జిల్లాకు చెందిన ప్రియాంక రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో డెర్మటాలజీ విభాగంలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్నారు. కుటుంబంలో తొలి వైద్యురాలిగా నిలిచి, వైద్య రంగంలో సేవలందించాలనే లక్ష్యంతో ఆమె ముందుకు సాగుతున్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆమె ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, స్నేహితులు, తోటి వైద్య విద్యార్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

**అవయవదానానికి తల్లిదండ్రుల అంగీకారం** కుమార్తెను కోల్పోయిన తీవ్ర విషాదంలోనూ ప్రియాంక తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. తమ కుమార్తె అవయవాలను దానం చేసేందుకు వారు అంగీకరించారు. తమ బిడ్డ ఇక లేకపోయినా.. ఆమె అవయవాల ద్వారా మరికొందరికి కొత్త జీవితం లభించాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకోవడం గొప్ప మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది.వైద్యురాలిగా ఎంతోమందికి సేవ చేయాలన్న ప్రియాంక ఆశయం నెరవేరకుండానే ఆమె జీవితం అర్ధంతరంగా ముగియడం కుటుంబ సభ్యులను కలచివేసింది. ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. డాక్టర్ ప్రియాంక మృతికి తోటి వైద్యులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కాలువకట్ట సమస్యకు శాశ్వత పరిష్కారం ప్రజల వద్దకే: మంత్రి నారాయణ

- వైసీపీ గ్రాఫ్ పడిపోతోందని వ్యాఖ్య



**నెల్లూరు(ప్రశ్న న్యూస్)** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు నగర నియోజకవర్గంలోని 15, 8, 10 డివిజన్లలో అధికారులతో కలిసి పర్యటించిన ఆయన స్థానిక ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి సమస్యలను పరిశీలించారు.పలువురు స్థానికులు తమ సమస్యలను మంత్రికి వివరించగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యలపై మంత్రి స్వయంగా స్పందించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలకగా, చిన్నారులతో ముచ్చటించి చాక్లెట్లు పంపిణీ చేశారు.సర్వేపల్లి కాలువకట్ట ప్రాంత ప్రజల సమస్యలపై మంత్రి ప్రత్యేకంగా స్పందించారు. అక్కడ దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రజలను ఇబ్బందులకు గురిచేయబోమని హామీ ఇచ్చారు. భగత్‌సింగ్ కాలనీ తరహాలో అర్హులైన కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా సర్వే నిర్వహించి అర్హులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని అన్నారు.ఈ సందర్భంగా వైసీపీపై మంత్రి విమర్శలు గుప్పించారు. భోగాపురం విమానాశ్రయం, మెగా డీఎస్సీ వంటి కార్యక్రమాలపై అనవసర విమర్శలు చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి వైసీపీ నాయకులు అసహనంతో వ్యవహరిస్తున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే 2029 నాటికి వైసీపీ గ్రాఫ్ జీరోకు చేరుతుందని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, కమిషనర్ నందన్, ఎంఆర్వో వెంకటలక్ష్మి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఐఏఎస్‌లకు స్థానచలనం.. కొత్త బాధ్యతలు

- పలు శాఖలకు కొత్త అధికారులు..
- టీటీడీ, పర్యాటకం, వైద్య ఆరోగ్యం, పట్టణాభివృద్ధిలో కీలక మార్పులు

**అమరావతి(ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో పలువురు ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీలు, నియామకాలు, అదనపు బాధ్యతలకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పలు కీలక శాఖల్లో అధికారులను మారుస్తూ.. మరికొందరికి అదనపు బాధ్యతలు అప్పగించింది. టీటీడీ, పర్యాటక, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్యం, రవాణా, పట్టణాభివృద్ధి తదితర విభాగాల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి.ముఖ్య బదిలీలు, నియామకాలు ఇలా..ఎస్.ఎస్. రావత్‌ను పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు.జె. శ్యామలరావును పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారు.కోనా శశిధర్ను రవాణా, రోడ్లు--భవనాల శాఖ కార్యదర్శిగా నియమించారు.ఎం. శివ ప్రసాద్, ఐఎఫ్ఎస్‌ను ఏపీఎస్ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.అమ్రపాలి కాటాను ఏపీటీడీసీ ఎండీ బాధ్యతల నుంచి రిలీవ్ చేసి, తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.పట్టంశెట్టి రవి సుభాష్ను ఏపీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు.సురేష్ కుమార్ను గోదావరి పుష్కరాల ప్రత్యేక అధికారిగా నియమించారు. నారాయణ భరత్ గుప్తాకు జాయింట్ స్పెషల్ ఆఫీసర్ బాధ్యతలు అప్పగించారు.ముత్యాలరాజు రేవును పురావస్తు, మ్యూజియంల కమిషనర్‌గా బదిలీ చేశారు.కె.వి.ఎన్. చక్రధర బాబుకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్, నేషనల్ హెల్త్ మిషన్ ఎండీగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.హెప్సిబా రాణి కొర్లపాటిను హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.పి. అరుణ్ బాబును డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు.ఎన్. తేజ్ భరత్‌ను విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. ప్రఖర్ జైన్ను వీఎంఆర్డీఏ కమిషనర్‌గా నియమించారు.గీతాంజలి శర్మకు ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ ఎండీగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.లిలిచేతన్ టి.ఎస్.లిలికు డైరెక్టర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బాధ్యతలను ఎఫ్ఏసీగా అప్పగించారు.టీటీడీలోనూ మార్పులుతిరుమల తిరుపతి దేవస్థానాల పరిధిలో హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ విభాగానికి సంబంధించిన బాధ్యతల్లోనూ మార్పులు చేశారు. లిలిడా. ఎ. శరత్ (రిటైర్డ్ ఐఏఎస్)లిలిను టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (హెల్త్ అండ్ ఎడ్యుకేషన్)గా కొనసాగించారు. ప్రభల గోపీనాథ్ను అదే విభాగం జేఈఓగా నియమించారు.ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఎ.ఎ.ఎల్. పద్మావతికి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.తిరుపతికి కొత్త కమిషనర్తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు కొత్త కమిషనర్‌గా ఎం. జయకృష్ణను నియమించారు. మరోవైపు బి. అనిల్ కుమార్ రెడ్డిను ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. బి. సునీల్ కుమార్ రెడ్డి, ఐఎఫ్ఎస్‌కు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.పలు కీలక శాఖల్లో అధికారులు మారడంతో ఆయా విభాగాల పరిపాలనపై ఈ బదిలీల ప్రభావం ఉండనుంది. ముఖ్యంగా పర్యాటకం, వైద్య ఆరోగ్యం, పట్టణాభివృద్ధి, టీటీడీ, స్వచ్ఛ ఆంధ్ర తదితర శాఖల్లో కొత్త బాధ్యతలు చేపట్టనున్న అధికారులపై కీలక బాధ్యతలు ఉన్నాయి.

# వైసీపీ క్రిమినల్స్ ఫ్యాక్టరీ

- రాజకీయాల కోసం సొంత కార్యకర్తలనూ బలి తీసుకుంటోంది.
- రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు తిప్పికొట్టాలి: మంత్రి సవిత



మంగళగిరి(ప్రశ్న న్యూస్) వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ పార్టీ కాదని, అది "క్రిమినల్స్ ఫ్యాక్టరీ"గా మారిందని బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తీవ్ర విమర్శలు చేశారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, స్వార్థ రాజకీయాలు, అధికార దాహం కోసం జగన్‌మోహన్ రెడ్డి సొంత పార్టీ కార్యకర్తలను, బడుగు బలహీన వర్గాల యువతను బలి తీసుకుంటున్నారని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమానంగా ముందుకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తోందన్నారు.గత వైసీపీ పాలనలో హత్యా రాజకీయాలు, విధ్వంసం, అవినీతి పెరిగాయని, బడుగు, బలహీన వర్గాలపై దౌర్జన్యాలు జరిగాయని విమర్శించారు. ప్రజలు అందుకే వైసీపీని తిరస్కరించి కూటమి ప్రభుత్వానికి స్పష్టమైన మెజారిటీ ఇచ్చారని పేర్కొన్నారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు, రైజింగ్ రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వంటి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని సమగ్రాభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని చెప్పారు.రాష్ట్రంలో అలజడులు సృష్టించే రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని, భావితరాల భవిష్యత్తు కోసం వైసీపీని ప్రజాస్వామ్యబద్ధంగా ఓటుతో ఓడించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

# కళాకారులకు మళ్లీ గౌరవం

- ప్రత్యేక పెన్షన్ పునరుద్ధరణకు చర్యలు
- నాటకాలకు పూర్వవైభవం తెస్తాం: మంత్రి దుర్గేష్



విజయవాడ(ప్రశ్న న్యూస్) తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావడంతో పాటు కళాకారుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విజయవాడలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ నూతన సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ సమక్షంలో నూతనంగా నియమితులైన 22 మంది సభ్యులు బాధ్యతలు స్వీకరించగా, మంత్రి దుర్గేష్ వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పద్య నాటకాలు, పౌరాణిక నాటకాలు, సాంఘిక నాటకాలు, జానపద కళారూపాలను గ్రామస్థాయి నుంచి ప్రోత్సహించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందన్నారు. కళారంగానికి సేవ చేసే అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.కళాకారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్న మంత్రి, గతంలో అమలులో ఉన్న ప్రత్యేక కళాకారుల పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కళాకారుల ప్రత్యేక గుర్తింపును కాపాడటమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు.ఈ కార్యక్రమంలో నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన 22 మంది సభ్యులు, కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

# కురుపాంలో ఆధునిక వైద్యానికి కొత్త చిరునామా

- రూ.3 కోట్లతో 50 పడకల సీహెచ్‌సీ ప్రారంభం..
- గిరిజనులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



కురుపాం(ప్రశ్న న్యూస్) మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కురుపాంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల ఆధునిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ, మన్యం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.ఒకప్పుడు కేవలం ఒక వైద్యుడు, ఒక స్టాఫ్ నర్సుతో నడిచిన చిన్న ఆరోగ్య కేంద్రం నేడు అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన 50 పడకల ఆధునిక ఆసుపత్రిగా రూపుదిద్దుకోవడం గిరిజన ప్రాంత ప్రజలకు పెద్ద ఊరటనిచ్చే పరిణామంగా నిలిచింది. అత్యవసర వైద్య సేవలు, గర్భిణుల సంరక్షణ, సాధారణ చికిత్సలు, అవసరమైన వైద్య సదుపాయాలు ఇప్పుడు స్థానికంగానే అందుబాటులోకి రావడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గనుంది. గిరిజనులు, పేదలు, గర్భిణులు, అత్యవసర రోగులను కుటుంబ సభ్యుల్లా భావించి ఆప్యాయంగా వైద్య సేవలు అందించాలని సూచించారు. సమయపాలనతో పాటు ప్రతి రోగికి గౌరవప్రదమైన సేవలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు.ఆసుపత్రిలో పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు మంత్రి ప్రత్యేకంగా సూచించారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఆసుపత్రిలో నమ్మకం, భరోసా కలిగించే వాతావరణం ఉండాలన్నారు. పరిశుభ్రత, సేవల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఆధునిక ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. విజయలక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డా. జి. నాగభూషణరావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.కొత్త సీహెచ్‌సీ ప్రారంభంతో కురుపాం, పరిసర గిరిజన మండలాల వేలాది మందికి నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ కావడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చికిత్స అందే అవకాశాలు పెరగనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# చిత్రకళకు 'వీధి'.. కళాకారులకు వేదిక

- కళలను ప్రజల వాకిళ్ల వద్దకు తీసుకురావడమే లక్ష్యం
- అమరావతి చిత్రకళా వీధి ప్రారంభోత్సవంలో : ఎమ్మెల్యే గళ్లా మాధవి



గుంటూరు(ప్రశ్న న్యూస్) కళాకారులకు తెలుగు గడ్డ ఎప్పటి నుంచో నిలయంగా ఉందని, కళలను ప్రజల వాకిళ్ల వద్దకు తీసుకురావడమే అమరావతి చిత్రకళా వీధి ప్రధాన లక్ష్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు నగరం కొరిటెపాడు మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన అమరావతి చిత్రకళా వీధిని శనివారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కళాకారులు తమ సృజనలను ప్రజలకు పరిచయం చేసేందుకు, కళాభిమానులు వాటిని వీక్షించేందుకు, విద్యార్థులు కళలపై ఆసక్తి పెంచుకునేందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.చిత్రకళ ద్వారా కళాకారుడి ఆలోచనలు, భావోద్వేగాలు, ఊహాశక్తి ప్రజలకు చేరుతాయని పేర్కొన్నారు. "మనసులోని భావాలను రంగులు, గీతల రూపంలో వ్యక్తీకరించడమే కళ. ప్రతి మనిషిలోనూ ఒక కళాకారుడు ఉంటాడు" అని గళ్ళా మాధవి అన్నారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్నప్పటికీ.. కళాకారుడి చేతివేళ్లలోని నైపుణ్యానికి ప్రత్యామ్నాయం లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిత్రకారుడు తన ఊహాశక్తిని, ఆలోచనలను, భావోద్వేగాలను రంగులతో ఆవిష్కరించే తీరు ప్రత్యేకమన్నారు. డిజిటల్ సాధనాలు ఎన్ని వచ్చినా సృజనాత్మకతకు, కళాకారుడి ప్రతిభకు ఉన్న విలువ తగ్గదని అన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కళాకారుల్లో కొత్త ఉత్సాహం వచ్చిందని గళ్ళా మాధవి అన్నారు. కళారంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కళాకారులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వ విధానాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. కళలు, సంస్కృతిని పరిరక్షిస్తూ కళాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వినిని ఎమ్మెల్యే అభినందించారు. కళాకారులకు అండగా నిలుస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఇతర ప్రజాప్రతినిధులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# కన్నా పేగుబంధం ఏమైపోతుంది

**- వీడియో కాల్లోనే కడసారి చూపులు - క్షీణిస్తున్న మానవ సంబంధాలకు ఇదేనా నిదర్శనం**

**- వృద్ధాశ్రమాల్లో ఒంటరి తల్లిదండ్రులు, విదేశాల్లో పిల్లలు - చివరికి మొబైల్ స్క్రీన్‌పైనే కన్నవారి అంతిమ దర్శనం**

**- సాంకేతికత పెరిగింది.. కానీ మమకారం తగ్గుతోంది**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఒకప్పుడు తల్లిదండ్రులే పిల్లలకు ప్రపంచం. పిల్లల భవిష్యత్తు కోసం తమ జీవితాలను త్యాగం చేసి, రెక్కలు ముక్కలు చేసుకుని చదివించి, ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన తల్లిదండ్రులు. అదే పిల్లల జీవితంలో చివరికి భారంగా మారుతున్నారా.? అనే ప్రశ్న నేటి సమాజం ముందుంది. ఆస్తులు సంపాదించాం.. డబ్బు సంపాదించాం.. పిల్లలను ఉన్నత చదువులు చదివించాం.. కానీ చివరి దశలో తల్లిదండ్రులకు మనం ఇచ్చేది ఏమిటి.? ఈ ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన సమయం వచ్చింది.హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోషల్ మీడియాలో పంచుకున్న ఓ ఘటన మానవ సంబంధాలపై తీవ్ర చర్చకు దారితీస్తోంది. హరియాణాలోని సోనిపట్‌కు చెందిన ఓ వృద్ధుడు జీవితాంతం సంపాదించినా, చివరి దశలో వృద్ధాశ్రమంలో ఒంటరిగా కన్నుమూశారని, ఆయన అంత్యక్రియలను కుమార్తెలు వీడియో కాల్ ద్వారా వీక్షించారని పేర్కొంటూ సజ్జనార్ ఆవేదన వ్యక్తం చేశారు. అంత్యక్రియల ఖర్చుల కోసం ఆన్‌లైన్‌లో డబ్బు పంపడం ద్వారా బాధ్యత పూర్తయిందని భావించడం మనిషి జీవితంలో డబ్బు పెరిగి.. అనుబంధం తగ్గిపోతున్న పరిస్థితికి ప్రతీకగా మారిందనే ఆవేదన వ్యక్తమవుతోంది.

### తల్లిదండ్రుల కోసం పిల్లలకు సమయం ఎందుకు దొరకడం లేదు..

ఉద్యోగాలు.. వ్యాపారాలు.. విదేశీ అవకాశాలు.. ఆర్థిక అవసరాలు.. ఇవన్నీ మనిషి జీవితంలో భాగమే. పిల్లలు దూర ప్రాంతాల్లో ఉండటం తప్పనిసరి కావచ్చు.

కానీ..వారానికి ఒకసారి ఫోన్ చేయడానికి సమయం లేదా.? నెలకు ఒకసారి వచ్చి తల్లిదండ్రులను చూసేందుకు అవకాశం లేదా.?

వారి అనారోగ్యం, వృద్ధాప్యం, ఒంటరితనాన్ని అర్థం చేసుకునే మనసు లేదా.? ఇదే నేడు సమాజం ముందున్న అసలు ప్రశ్న.

### వృద్ధాశ్రమం.. ఆశ్రయమా.? లేక అనుబంధం కోల్పోయిన కుటుంబానికి అద్దమా.?

వృద్ధాశ్రమాలు అవసరమైన వారికి మంచి సేవలు అందిస్తున్నాయి. అయితే కొందరు తల్లిదండ్రులు పరిస్థితుల కారణంగా అక్కడికి చేరుతున్నప్పటికీ, మరికొందరు తమ పిల్లలు తమను చూసుకోలేని పరిస్థితుల్లోకి నెట్టివేయడంతో అక్కడికి చేరుతున్నారనే ఆవేదన వినిపిస్తోంది. ఒక తల్లి తన పిల్లల కోసం ఎన్నో రాత్రులు నిద్రపోకుండా గడుపుతుంది. ఒక తండ్రి తన పిల్లల చదువుల కోసం అప్పులు చేస్తాడు. వారి భవిష్యత్తు కోసం తన సౌకర్యాలను త్యాగం చేస్తాడు. అలాంటి తల్లిదండ్రుల వృద్ధాప్యంలో వారికి కావాల్సింది కోట్ల రూపాయలు కాదు. రెండు మాటలు. కొంత సమయం. ఒక ఆత్మీయమైన పలకరింపు. అవసరమైనప్పుడు తమ పిల్లలు పక్కన ఉండటం.

### వీడియో కాల్‌లో చివరి చూపు.. ఎంత విషాదం

సాంకేతికత మన జీవితాలను ఎంతో సులభతరం చేసింది. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యక్తిని క్షణాల్లో మన ముందుకు తీసుకొచ్చింది. కానీ వీడియో కాల్‌లో కనిపించే ముఖం, పక్కన కూర్చుని పట్టుకునే చేయికి ప్రత్యామ్నాయం కాదు. ఆన్‌లైన్‌లో పంపే డబ్బు, కన్నవారిపై చూపించే ప్రేమకు ప్రత్యామ్నాయం కాదు. మొబైల్ స్క్రీన్‌పై చూసే చివరి దర్శనం, తల్లిదండ్రుల చివరి ప్రయాణంలో పక్కన నిలబడటానికి సమానం కాదు. సాంకేతికత అనుబంధాలను కలుపుకోవడానికి ఉపయోగపడాలి కానీ, అనుబంధాల స్థానాన్ని ఆక్రమించకూడదు.

### కోట్ల సంపాదన.. కానీ తల్లిదండ్రులకు సమయం లేదా.?

విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు, ఇతర నగరాల్లో స్థిరపడినవారు తమ కుటుంబాలను పోషించడానికి ఎంతో కష్టపడుతున్నారు. ఇది తప్పు కాదు. కానీ సంపాదన కోసం




పరుగులు తీస్తూ మన కోసం జీవితాన్ని త్యాగం చేసిన తల్లిదండ్రులను మరచిపోవడం మాత్రం కచ్చితంగా తప్పే. మన పిల్లలకు మంచి భవిష్యత్తు కావాలని కోరుకుంటాం. అయితే మన పిల్లలు కూడా ఒకరోజు మనలాగే తమ జీవితాల్లో బిజీ అవుతారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈరోజు మనం తల్లిదండ్రులతో ఎలా ఉంటామో.. రేపు మన పిల్లలు మనతో అలాగే ఉండే అవకాశం ఉంది.

### పిల్లలారా.. ఒక్కసారి ఆలోచించండి..

మీరు చిన్నప్పుడు అనారోగ్యంతో ఉంటే రాత్రంతా మీ పక్కన ఎవరు ఉన్నారు.? మీకు ఆకలేస్తే ముందుగా ఎవరు తినిపించారు.? మీ చదువుల కోసం తమ అవసరాలను ఎవరు పక్కన పెట్టారు.? మీరు ఉద్యోగం కోసం దూరంగా వెళ్తుంటే కన్నీళ్లతో వీడ్కోలు చెప్పింది ఎవరు.? మీ విజయాన్ని తమ విజయంగా భావించింది ఎవరు.? ఆ తల్లిదండ్రులు వృద్ధాప్యంలో మీ సమయం కోసం ఎదురుచూస్తున్నప్పుడు.. మీరు ఎక్కడ ఉన్నారు.?

### విదేశాల్లో పిల్లలు.. ఇక్కడ ఒంటరిగా తల్లిదండ్రులు

నేడు అనేక కుటుంబాల్లో పిల్లలు విదేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. దూరం తప్పనిసరి కావచ్చు. కానీ దూరం అనేది మనసుల మధ్య దూరంగా మారకూడదు. వీడియో కాల్ చేయండి. ఫోన్ చేయండి. వారి ఆరోగ్యం అడగండి. వీలైనప్పుడల్లా ఇంటికి వెళ్లండి. వారి పుట్టినరోజు, పెళ్లిరోజు మాత్రమే కాదు.. వారి సాధారణ రోజుల్లో కూడా వారితో ఉండండి. ఎందుకంటే వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు వేడుకల కంటే తోడు ముఖ్యం. డబ్బు పంపడం బాధ్యత కాదు.. ప్రేమకు డబ్బుతో కొలమానం లేదు తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం చేయడం మంచిదే కానీ డబ్బు పంపించాం కాబట్టి బాధ్యత పూర్తయింది అనుకోవడం మాత్రం తప్పే. తల్లిదండ్రులు తమ పిల్లల నుంచి కోరుకునేది కేవలం డబ్బు కాదు. నాన్న ఎలా ఉన్నావు.? అమ్మ మందులు వేసుకున్నావా.? ఆరోగ్యం జాగ్రత్త..




నేను వస్తున్నాను.. జాగ్రత్తగా ఉండండి.. అనే మాటల్లోనే వారికి ఎంతో ప్రేమ ఉంటుంది.

### సమాజం మారాలి.. కుటుంబ విలువలు తిరిగి రావాలి

ఆర్థిక అభివృద్ధి అవసరం. సాంకేతిక అభివృద్ధి అవసరం. విదేశీ అవకాశాలు కూడా అవసరమే. కానీ వాటన్నింటి మధ్య తల్లిదండ్రుల పైన ప్రేమ, మనుషుల పట్ల మానవత్వం, కుటుంబ అనుబంధం, తల్లిదండ్రుల పట్ల బాధ్యత కనుమరుగైతే ఆ అభివృద్ధికి అర్థం ఏమిటనే ప్రశ్న తలెత్తుతుంది. పిల్లలు తమ జీవితాలను నిర్మించుకోవాలి. అదే సమయంలో తమను ఈ ప్రపంచంలోకి తీసుకొచ్చిన తల్లిదండ్రుల జీవితాల్లో కూడా తమ వంతు స్థానం కల్పించాలి.

### ఒక్కసారి మనల్ని మనమే ప్రశ్నించుకోవాలి

**తల్లిదండ్రులు బతికున్నప్పుడు మనకు సమయం ఉందా.?**

- వారి ఆరోగ్యం గురించి మనం నిజంగా పట్టించుకుంటున్నామా.?
- వారితో కూర్చుని మాట్లాడటానికి రోజులో కనీసం పది నిమిషాలు కేటాయిస్తున్నామా.?
- మన విజయాన్ని చూసి గర్వపడే తల్లిదండ్రులు.. మన ప్రేమను కూడా అనుభవిస్తున్నారా.?
- వృద్ధాశ్రమంలో ఉన్న తల్లిదండ్రులను కేవలం డబ్బుతోనే చూసుకుంటున్నామా.?
- చివరి క్షణాల్లో వీడియో కాల్ కాకుండా వారి పక్కన నిలబడే ప్రయత్నం చేస్తున్నామా.?

### తల్లిదండ్రులకు చివర్లో కావాల్సింది ఆస్తి కాదు.. నీ ఆప్యాయత, ప్రేమ.

తల్లిదండ్రులు పిల్లల నుంచి పెద్దగా ఏమీ ఆశించరు. తాము కష్టపడి పెంచిన పిల్లలు తమ పక్కన ఉండాలని మాత్రమే కోరుకుంటారు. వారికి కోట్ల రూపాయలు అవసరం లేదు.. కొంత సమయం కావాలి. వారికి ఖరీదైన బహుమతులు అవసరం లేదు.. ఆప్యాయత కావాలి. వారికి వీడియో కాల్‌లో ముఖం కనిపించడం కాదు.. తమ పిల్లల చేయి తమ చేతిలో ఉండాలి. కాబట్టి సంపాదించండి.. ఎదగండి.. ప్రపంచాన్ని చుట్టిరండి.. కానీ మిమ్మల్ని ప్రపంచంలోకి తీసుకొచ్చిన తల్లిదండ్రులను మాత్రం అస్సలు మర్చిపోవద్దు. ఎందుకంటే.. తల్లిదండ్రులు ఉన్నప్పుడు వారి విలువ తెలుసుకోండి.. వారు లేని తర్వాత ఎంత ఏడ్చినా ఆ లోటును పూడ్చలేం. వీడియో కాల్‌లో కడసారి చూపులు కాకుండా.. బతికున్నప్పుడే ప్రేమతో కడసారి కాదు, ప్రతి రోజూ వారిని చూసే అవకాశం ఏర్పాటు చేసుకోండి.. సమాజం మేలుకోవాలి.. తల్లిదండ్రులను ఎప్పటికీ చూసుకోవాలి.. కుటుంబాలు మళ్లీ కలవాలి.. మానవ సంబంధాలు నిలవాలి.

## ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు

**- తన భద్రతా అధికారిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన నివాసం వద్ద భద్రతా విధుల్లో ఉన్న ఓ పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కలిసేందుకు వచ్చే సందర్శకుల పట్ల సదరు అధికారి దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ వెంటనే అతడిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నీట్ పేపర్ లీక్ వంటి విద్యార్థి సమస్యలపై పోరాటం ద్వారా 30 ఏళ్ల అభిజీత్ దీప్కే ప్రాచుర్యంలోకి వచ్చారు. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఆన్‌లైన్‌లో బెదిరింపులు రావడంతో వాలుజ్ ఎంఐడీసీ ప్రాంతంలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. అయితే, మఫ్టీలో ఉన్న సురేశ్ అనే ఎస్ఐ తనను కలిసేందుకు వచ్చే వారిని లోపలికి రానీయకుండా ఆటంకం కలిగిస్తున్నారని దీప్కే ఆరోపించారు.వైరల్ అవుతున్న ఓ వీడియోలో అభిజీత్ దీప్కే సదరు ఎస్ఐని నిలదీస్తూ,"నేను రమ్మని పిలుస్తున్నప్పుడు ప్రజలను అనుమతించడానికి మీకేంటి ఇబ్బంది? ఢిల్లీ పోలీసుల్లా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? ఇప్పటివరకు ఎలాంటి సమస్యా తలెత్తలేదు, మిమ్మల్ని ఇప్పుడే మొదటిసారి చూస్తున్నాను. నేను ఎవరిని కలవాలి, ఎవరిని కలవకూడదు అనేది మీరు నిర్ణయించలేరు. దయచేసి ఇక్కడి నుంచి వెళ్ళిపోండి, మీరు నా ఇంట్లో ఉండాల్సిన అవసరం లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. మరో వీడియోలో ఆయన ఓ ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడుతూ, "సురేశ్ అనే ఎస్ఐ ఇక్కడ చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నారా? ఆయన నాకు వద్దు, వెంటనే ఇక్కడి నుంచి తొలగించండి" అని కోరారు. అంతేకాకుండా, రాష్ట్ర సీఐడీకి చెందిన సిబ్బంది మఫ్టీలో తన ఇంటి పరిసరాల్లో ఉంటూ 'హిట్ స్ప్రే' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నారని దీప్కే ఆరోపించారు. ఓ విలేకరి ఒక అధికారి ఫోన్‌లో ఈ గ్రూప్‌ను గమనించారని ఆయన పేర్కొన్నారు.

## యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవు

**- స్పష్టతనిచ్చిన కేంద్రం**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారుల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేయబోమని కేంద్ర ప్రభుత్వం శనివారం స్పష్టం చేసింది. భవిష్యత్తులో వ్యాపార లావాదేవీల కోసం 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) అమలు చేసినప్పటికీ, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన లావాదేవీలపై మాత్రమే ఉంటుందని, అది కూడా నామమాత్రంగానే ఉంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007కు ప్రతిపాదించిన సవరణలపై విస్తృత స్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ స్పష్టతనిచ్చింది. యూపీఐ ద్వారా వ్యక్తుల మధ్య జరిగే (పీ2పీ) లావాదేవీలు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని పేర్కొంది. వ్యాపారులపై అకస్మాత్తుగా ఎండీఆర్ భారం మోపబోమని, ఒకవేళ రుసుములు ప్రవేశపెట్టినా అవి డెబిట్ లేదా క్రెడిట్ కార్డులపై విధించే ఛార్జీల కంటే చాలా తక్కువగా ఉంటాయని వివరించింది.యూపీఐ వ్యవస్థ దీర్ఘకాలిక మన్నికను కాపాడటంతో పాటు, సాంకేతిక అభివృద్ధి, సైబర్ భద్రతను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతోనే ఈ సవరణలు చేపడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సదరు బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన అనంతరం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని కమిటీ ఎండీఆర్ అమలుపై తుది నిర్ణయం తీసుకోనుంది. 2026 జులై నెలలో యూపీఐ ద్వారా రూ. 29.9 లక్షల కోట్ల విలువైన 2,366 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. ఈ వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తున్న క్రమంలో, దాని నిర్వహణకు, సాంకేతిక భద్రతకు నిరంతర పెట్టుబడులు అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఇదే తరుణంలో వినియోగదారులకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితంగానే అందుతాయని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ సైతం స్పష్టం చేశారు. ఇప్పటికే పేమెంట్స్ కౌన్సిల్, ఫోన్ పే యాజమాన్యం కూడా యూపీఐ ఛార్జీలపై వివరణ ఇచ్చిన సంగతి తెలిసిందే.

# రేషన్ బియ్యం దందాకు సీఎన్‌జీ ఆటోలు

**- ఇబ్రహీంపట్నం మండలంలో యథేచ్ఛగా అక్రమ తరలింపు.?**

**- కాచవరం.. కేతనకొండ.. మూలపాడు..**

**- ఇబ్రహీంపట్నం నుంచి భారీగా తరలిస్తున్నారన్న ఆరోపణలు**

**- డీలర్ల వద్ద కొనుగోళ్లు.. ఆటోల్లో లోడింగ్.. పట్టించుకోని అధికారులు**

**ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్)** పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యంపై అక్రమార్కుల కన్ను పడిందా ? ప్రజాపంపిణీ వ్యవస్థను పక్కదారి పట్టిస్తూ కొందరు వ్యక్తులు అక్రమ రేషన్ బియ్యం దందాకు తెరలేపారన్న ఆరోపణలు ఇబ్రహీంపట్నం మండలంలో కలకలం రేపుతున్నాయి. కాచవరం, కేతనకొండ, మూలపాడు, ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లోని రేషన్ డీలర్ల వద్ద నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి సీఎన్‌జీ ప్యాసింజర్ ఆటోల్లో తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై అధికారులు దృష్టి సారించి వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

### డీలర్ల వద్ద కొనుగోళ్లు.. ఆటోల్లో తరలింపు.?

స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణల ప్రకారం.. కొన్ని ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించే వ్యక్తులు లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేయడంతో పాటు, డీలర్ల వద్ద నుంచీ భారీ మొత్తంలో బియ్యాన్ని సమీకరిస్తున్నట్లు సమాచారం. అనంతరం సంచులను సీఎన్‌జీ ప్యాసింజర్ ఆటోల్లోకి ఎక్కించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు చెబుతున్నారు. రోజువారీగా పలు వాహనాలు తిరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు గుర్తించలేకపోతున్నారన్న ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. అయితే మండలంలోని కొన్ని గ్రామాల్లో జరుగుతున్నట్లు చెబుతున్న ఈ వ్యవహారంపై ఇప్పటివరకు సమర్థవంతమైన నిఘా ఉందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### 'ఎవరేమైతే మాకేంటి' అన్న ధీమా.?

అక్రమ దందాకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు వ్యక్తులు అధికారుల తనిఖీలను సైతం ఏమాత్రం లెక్కచేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు అడ్డొస్తే చూసుకుంటామనే ధోరణిలో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజంగా ఇలాంటి పరిస్థితి ఉంటే.. అధికార యంత్రాంగంపై ఎవరి అండదండలు ఉన్నాయనే అంశంపై సమగ్ర విచారణ జరగాల్సిందే.

### బావబామ్మర్దుల పాత్రపై ఆరోపణలు

మూలపాడు ప్రాంతానికి చెందిన ఇద్దరు బావబామ్మర్దులు ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు వాస్తవమా.? లేక వ్యక్తిగత ఆరోపణలా.? అన్నది అధికారిక దర్యాప్తులో తేలాల్సి ఉంది. సంబంధిత వ్యక్తుల వాహనాల రాకపోకలు, రేషన్ బియ్యం తరలింపు, కొనుగోలు వ్యవహారాలపై నిఘా పెట్టి వాస్తవాలను వెలికితీయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.



### ఒక్కసారి పట్టుకుంటే.. దందా గుట్టురట్టు

రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందన్న అనుమానాలు ఉంటే.. సంబంధిత అధికారులు ఆయా గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. రేషన్ దుకాణాల స్టాక్ రిజిస్టర్లు, ఈ-పాస్ యంత్రాల్లో నమోదైన వివరాలు, గోదాముల నుంచి వచ్చిన నిల్వలు, లబ్ధిదారులకు పంపిణీ చేసిన పరిమాణాన్ని క్షేత్రస్థాయిలో సరిపోల్చాలి. అనుమానాస్పద వాహనాల రాకపోకలపై నిఘా పెట్టి, బియ్యం ఎక్కడి నుంచి వస్తోంది.. ఎక్కడికి వెళ్తోంది.. ఎవరు కొనుగోలు చేస్తున్నారు.. అనే అంశాలను విచారిస్తే దందా వెనుక ఉన్న అసలు వ్యక్తులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### పేదల బియ్యానికి భద్రత ఏదీ.?

రేషన్ బియ్యం పేదల ఆహార భద్రతలో కీలక భాగం. అది అక్రమంగా మార్కెట్‌కు తరలితే చివరికి నష్టపోయేది పేదలే. అందుకే ఇబ్రహీంపట్నం మండలంలోని కాచవరం, కేతనకొండ, మూలపాడు, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో రేషన్ బియ్యం కొనుగోలు, తరలింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. రేషన్ దుకాణాల నుంచి మొదలుకుని బియ్యం తరలిస్తున్న వాహనాల వరకు పూర్తి స్థాయి తనిఖీలు చేపట్టాలి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588